


మా కలం - సామాన్యుడి బలం

# స్వర్ణసాగరం

www.swarnasagaram.in జాతీయ తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 06 | పేజీలు : 80 | ఆదివారం 16 మార్చి 2025 | శనివారం 22 మార్చి 2025 | వెల : 2-00

## ఏపీలో ఆపరేషన్ గరుడ

- ఖంగుతిన్న మెడికల్‌షాప్ యజమానులు
- ఐజీ ఈగల్ టీమ్, విజిలెన్స్ ఎండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, లోకల్ పోలీస్, డ్రగ్స్ కంట్రోల్ టీమ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా దాడులు
- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు మెడికల్ షాప్‌లపై దాడులు
- మెడికల్ షాపుల్లో అక్రమ మత్తుపదార్థాలు ఉన్నాయా అనే దానిపై అధికారులు తనిఖీలు



**అమరావతి**

ఏపీలో ఆపరేషన్ గరుడ కొనసాగుతోంది. ఆపరేషన్ గరుడ లో భాగంగా డీజీపీ ఆదేశాల మేరకు ఐజీ ఈగల్ టీమ్, విజిలెన్స్ ఎండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, లోకల్ పోలీస్, డ్రగ్స్ కంట్రోల్ టీమ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా దాడులు జరుగుతున్నాయి. డ్రగ్స్ దుర్వినియోగంపై రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ షాప్స్, ఏజెన్సీస్‌పై అధికారులు దాడులు చేస్తున్నారు. - మిగతా3లో



## వచ్చే ఏడాది ఇదేరోజుకి నక్సల్స్‌ని ఏరేస్తాం

- అంతర్గత భద్రత పటిష్టతకు కట్టుదిట్టమైన చర్యలు
- 2026 మార్చి 21వ తేదీ నాటికి దేశంలో పూర్తిగా నక్సలిజాన్ని నిర్మూలిస్తాం
- బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వ హయాంలో నక్సల్స్ సమస్య నుంచి దేశానికి విముక్తి లభించనుంది
- దాదాపు నాలుగు దశాబ్దాలుగా దేశంలో అభివృద్ధి ముదుకు సాగలేదు.
- కేంద్ర హోం మంత్రి అమిత్‌షా

## ఏడుకొండల్లో వ్యాపారీకరణను అనుమతించం



- ఆ హోటళ్లకు అనుమతులు రద్దు
- అందుకే గత ప్రభుత్వం ఇచ్చిన 35.32 ఎకరాలను రద్దు చేస్తున్నాం
- అన్నిరాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాలు
- గ్రామాల్లో ఆలయాల నిర్మాణానికి నూతన ట్రస్ట్
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి
- మనవడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా స్వయంగా భక్తులకు అన్నప్రసాదం వితరణ
- అన్నదానానికి రూ.44 లక్షల విరాళం
- కుటుంబసభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం

**తిరుమల**

శ్రీవారి ఏడుకొండల్లో వ్యాపారీకరణను (కమర్షియలైజేషన్) అనుమతించబోమని, వాటి పరిధిలో గత ప్రభుత్వం హోటళ్ల నిర్మాణానికి ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఉదయం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మనవడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా సతీమణి భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, కోడలు బ్రాహ్మణితో కలిసి సంప్రదాయ వస్త్రధారణతో వైకుంఠం క్యూకాంప్లెక్స్ నుంచి ఆలయం వద్దకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. దేవాన్ష్ పేరిట ఒకరోజు అన్నప్రసాద కార్యక్రమానికి రూ.44 లక్షలు విరాళంగా అందించారు. మనవడితో కలిసి చంద్రబాబు స్వయంగా భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించారు. - మిగతా3లో

## ఢిల్లీ హైకోర్టు జడ్జి ఇంట్లో.. నోట్ల కట్టలు!



- ‘అగ్ని ప్రమాదంతో బయటపడ్డ గుట్టు
- హోలీ నాడు జస్టిస్ యశ్వంత్ వర్మ బంగ్లాలో అగ్ని ప్రమాదం..
- ఆర్పడానికి వెళ్లిన అగ్నిమాపక సిబ్బంది
- అక్కడ వారికి ఓ గదిలో కనిపించిన డబ్బు కట్టలు
- ఈ నెల 14న ఘటన జరిగితే.. 21న వెలుగులోకి
- రూ.15-50 కోట్ల దాకా ఉంటుందంటూ కథనాలు
- ప్రభుత్వ వర్గాల ద్వారా సీజేఐకి ఈ సమాచారం
- ఆయన నేతృత్వంలో సమావేశమైన కొలీజియం
- జస్టిస్ వర్మ బదిలీకి ఆ భేటీలో ఏకగ్రీవ ప్రతిపాదన!
- అలహాబాద్ హైకోర్టు న్యాయవాదుల అభ్యంతరం
- తమ హైకోర్టు ఏమైనా చెత్తబుట్టా? అని ఆగ్రహం
- డబ్బు కట్టలపై ఢిల్లీ హైకోర్టు సీజే ఇప్పటికే
- అంతర్గత విచారణ చేపట్టినట్టు ఓ ప్రకటనలో సుప్రీం వెల్లడి
- విచారణకు, బదిలీకి సంబంధం లేదన్న సుప్రీం
- జడ్జి ఇంట్లో డబ్బే దొరకలే: ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ డీజీ

## పోసానికి బెయిల్ మంజూరు



### సీఐడీ కేసులో పోసానికి బెయిల్ ముంజూరు

**గుంటూరు**

ప్రముఖ నటుడు, రచయిత పోసాని కృష్ణమురళికి గుంటూరు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. సీఐడీ కేసులో పోసానికి బెయిల్ ముంజూరు చేసింది. ఈ మేరకు పోసాని బెయిల్ పిటిషన్ శుక్రవారం మరోసారి విచారణ చేపట్టిన గుంటూరు కోర్టు.. బెయిల్ ను మంజూరు చేసింది. బుధవారం నాడు పోసాని బెయిల్ పిటిషన్ పై తీర్పును వాయిదా వేసిన కోర్టు.. ఈరోజు(శుక్రవారం) బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. - మిగతా3లో



## హనీట్రాప్ వ్యవహారంపై అట్టుడికిన అసెంబ్లీ

- సీడీలు ప్రదర్శించిన బీజేపీ ఎమ్మెల్యేలు
- అసెంబ్లీలో హనీట్రాప్ వ్యవహారంపై రగడ
- ముఖ్యమంత్రి సిద్దరామయ్య పసంగిస్తున్న సమయంలో బీజేపీ ఎమ్మెల్యేలు సభలో ఆందోళన
- మంత్రులే తమపై హనీట్రాప్ జరిగిందని ఆరోపిస్తున్నారని నినాదాల
- సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలకు శాలరీ డబుల్!

## స్పీడందుకున్న విశాఖ మెట్రో పనులు



- మంత్రి నారాయణ కీలక ఆదేశాలు
- ఎయిర్ పోర్ట్ రోడ్ల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు వస్తాయి
- రోడ్ల విస్తరణ చేయాల్సి ఉంది
- ఈ ప్రాంతాల్లో తాగునీటి సమస్య కూడా ఎక్కువగా ఉంది
- గతంలో స్వార్థం కోసం మాస్టర్ ప్లాన్ రూపొందించారు

**విశాఖపట్నం**

భోగాపురం ఎయిర్ పోర్ట్ రోడ్ల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు వస్తాయని మంత్రి నారాయణ అన్నారు. ఇందుకోసం రోడ్ల విస్తరణ చేయాల్సి ఉందని అన్నారు. ఈ ప్రాంతాల్లో తాగునీటి సమస్య కూడా ఎక్కువగా ఉందని తెలిపారు. విశాఖ జిల్లా ఎమ్మెల్యేలతో శుక్రవారం మంత్రి నారాయణ సమావేశం నిర్వహించారు. నగర అభివృద్ధి, మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీ, ఇతర ట్రాఫిక్ సమస్యలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా - మిగతా3లో

## ప్రజలకు కూల్ న్యూస్

- ఆంధ్రప్రదేశ్‌లో పలు ప్రాంతాల్లో తేలకపాటి వర్షాలు కురుస్తాయని వెల్లడి
- కోస్తా తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు
- మూడు రోజుల అనంతరం రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి
- వర్షాలు పడిన తర్వాత ఎండల మరింత తీవ్రం అవుతాయనే ఓ విధమైన ఆందోళన



**విశాఖపట్నం**

వేసవి కాలం ఇంకా ప్రారంభం కాలేదు. అప్పుడు ఎండలు దంచి కొడుతోన్నాయి. అలాంటి వేళ.. ఏపీ ప్రజలకు విశాఖపట్నంలోని తుఫాన్ హెచ్చరికల కేంద్రం కూల్ న్యూస్ చెప్పింది. ఆంధ్రప్రదేశ్‌లో పలు ప్రాంతాల్లో తేలకపాటి వర్షాలు కురుస్తాయని శుక్రవారం వెల్లడించింది. రేపు అంటే.. శనివారం ఈ వర్షాలు కురుస్తాయని వివరించింది. అయితే కోస్తా తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. మూడు రోజుల అనంతరం రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరగనున్నాయని పేర్కొంది. ఇప్పడే ఎండలు మండిపోతున్నాయి. వర్షాలు పడిన తర్వాత - మిగతా3లో



## అసమానత్వం, వివక్షపై నిజం నిగ్గుతేలాలి

- కులగణనపై మళ్లీ రాహుల్ వ్యాఖ్యలు
- మహద్ సత్యాగహాపైన, అడ్మినిస్ట్రేషన్, విద్య, బ్యూరోక్రసీ, వనరుల విషయంలో దళితులు జరుపుతున్న పోరాటంపైన చర్చించడం జరిగింది
- ఇది సమానత్వం, గౌరవానికి సంబంధించిన పోరాటమని, 98 ఏళ్ల క్రితం మొదలైన ఈ పోరాటం ఇప్పటికీ కొనసాగుతోంది

స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# ఢిల్లీ హైకోర్టు జడ్జి ఇంట్లో.. నోట్ల కట్టలు!

**న్యూఢిల్లీ**

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ బంగ్లాలో అగ్ని ప్రమాదం జరిగితే ఆర్పడానికి వెళ్లిన అగ్నిమాపక సిబ్బందికి ఆ ఇంట్లో కట్టలకొద్దీ నగదు కనిపించినట్టు వచ్చిన వార్త దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ నెల 14 (హెూలీ రోజు) రాత్రి 11.35 గంటల సమయంలో ఈ ప్రమాదం జరగ్గా.. డబ్బు కట్టలు బయటపడ్డ విషయం 21వ తేదీ దాకా బయటకు రాకపోవడం మిస్టరీగా మారింది. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో న్యాయమూర్తి ఊళ్లో లేరని సమాచారం. ఆయన కుటుంబసభ్యులు అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేయగా.. సిబ్బంది వచ్చి మంటలను ఆర్పి లోపలకు వెళ్లగా ఒక గదిలో కట్టల కట్టల నగదు కనిపించిందని.. ఆ డబ్బు రూ.15 కోట్ల దాకా ఉంటుందని కొన్ని వర్గాలు తెలపగా.. దొరికిన డబ్బు రూ.50 కోట్ల దాకా ఉంటుందని మరికొన్ని వర్గాలు చెబుతున్నాయి. వాస్తవంగా ఆ రోజు ఎంత డబ్బు బయటపడిందన్న విషయంపై అధికారిక సమాచారమేదీ లేదు. కాగా.. జడ్జి ఇంట్లో భారీ ఎత్తున నగదు బయటపడిన విషయాన్ని స్థానిక పోలీసులు ఉన్నతాధికారులకు చేరవేశారని.. వారి ద్వారా ఈ విషయం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నాకు తెలిసిందని సమాచారం. ఆయన దీన్ని తీవ్రంగా పరిగణించి కొలీజియం సమావేశం నిర్వహించగా.. జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని కొలీజియం ఏకగ్రీవంగా ప్రతిపాదించినట్టు సమాచారం. అయితే.. జరిగిన ఘటన తీవ్రత నేపథ్యంలో కేవలం జడ్జి బదిలీతో సరిపెడితే అది న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను, ప్రజలకు న్యాయ వ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తుంది కాబట్టి జస్టిస్ వర్మ రాజీనామా కోరాలని కొలీజియంలోని కొందరు సభ్యులు అభిప్రాయపడినట్టు తెలిసింది. ఒకవేళ ఆయన అందుకు నిరాకరిస్తే సీజేఐ ఆయనపై అంతర్గత విచారణ చేపట్టాలని కూడా సూచించినట్టు సమాచారం. కాగా.. జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలన్న ప్రతిపాదనపై అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ తీవ్రంగా స్పందించింది. న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో ఏదో కొరవడుతోందని, అది అవినీతికి దారితీసి.. అంతిమంగా ప్రజలకు న్యాయవ్యవస్థపై ప్రజలకున్న నమ్మకాన్ని దెబ్బతీస్తోందని ఆందోళన వెలిబుచ్చింది. "అలహాబాద్ హైకోర్టు ఏమీ చెత్త బుట్టా?" అని ఆగ్రహం వ్యక్తం చేసింది.

**తప్పుడు సమాచారం..**

అలహాబాద్ హైకోర్ట్ బార్ అసోసియేషన్‌తోపాటు.. దేశవ్యాప్తంగా న్యాయవర్గాలు, ప్రజల నుంచి దీనిపై విమర్శలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు ఒక ప్రకటన విడుదల చేసింది. "జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటివద్ద జరిగిన ఘటనకు సంబంధించి తప్పుడు సమాచారం, వదంతులు వ్యాపిస్తున్నాయి" అని అందులో పేర్కొంది. ఈ వ్యవహారంపై మార్చి 20న సుప్రీం కోలీజియం సమావేశం కావడానికి ముందే.. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అంతర్గత విచారణ ప్రారంభించి, వివరాలు సేకరిస్తున్నారని వెల్లడించింది. ఆయన్నుంచి నివేదిక అందగానే దాన్ని పరిశీలించి తదుపరి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. "ఢిల్లీ హైకోర్టులో రెండో సీనియర్ మోస్ట్ జడ్జి, కొలీజియం సభ్యుడు అయిన జస్టిస్ యశ్వంత్‌వర్మను.. ఆయన పేరెంట్ కోర్టు అయిన 'హైకోర్ట్ ఆఫ్ జ్యుడికేచర్ ఎట్ అలహాబాద్'కు బదిలీ చేయాలన్న ప్రతిపాదన, ఢిల్లీ హైకోర్టులో ఆయనపై జరుగుతున్న అంతర్గత విచారణ.. ఈ రెండూ వేర్వేరు అంశాలు. ఆయన్ను బదిలీ చేయాలన్న ప్రతిపాదనను సుప్రీం సీజే, నలుగురు సీనియర్ మోస్ట్ సుప్రీం జడ్జీలతో కూడిన కొలీజియం మార్చి 20న పరిశీలించింది. అనంతరం దీనిపై సుప్రీంకోర్టులోని కన్సల్టీ జడ్జీలకు, సంబంధిత హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులకు లేఖలు రాసింది. వారి నుంచి వచ్చిన ప్రతిస్పందనలను పరిశీలించి, కొలీజియం దీనిపై ఒక నిర్ణయం తీసుకుంటుంది" అని ఆ ప్రకటనలో సుప్రీంకోర్టు పేర్కొంది.

**తీవ్రమైన విషయం..**

జస్టిస్ వర్మ ఇంట్లో డబ్బు కట్టల వ్యవహారంపై పలువురు ప్రముఖ న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది చాలా తీవ్రమైన విషయమని.. ఆయన్ను వెంటనే రాజీనామా చేయాల్సిందిగా కోరాలని సీనియర్ అడ్వొకేట్ వికాస్ సింగ్ అభిప్రాయపడ్డారు. ఇలాంటి వ్యవహారాల్లో బదిలీ పరిష్కారం కాదని ఆయన తేల్చిచెప్పారు. ఇక.. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు అంతర్గత విచారణ జరిపి, నిజాలను రాబట్టాలని మరో సీనియర్ అడ్వొకేట్ రాకేశ్ ద్వివేది అభిప్రాయపడ్డారు. దీనికి సంబంధించిన వాస్తవాలను పూర్తిగా, స్వేచ్ఛగా, సూటిగా బయటపెట్టాల్సిన బాధ్యత సుప్రీంకోర్టు కోలీజియంపై ఉందని సీనియర్ అడ్వొకేట్ ఇందిరా జైసింగ్ అన్నారు. ఎప్పుడో మార్చి 14న ఘటన జరిగితే.. మార్చి 21 దాకా ఆ విషయం బయటపడకపోవడం ఆశ్చర్యంగా ఉందని ఆమె వ్యాఖ్యానించారు.

**రాజ్యసభలో..**

జస్టిస్ వర్మ ఇంట్లో నోట్ల కట్టల వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నేపథ్యంలో.. శుక్రవారం రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ జైరామ్ రమేశ్ ఈ అంశాన్ని లేవనెత్తారు. న్యాయవ్యవస్థలో జవాబుదారీతనం గురించి రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ స్పందన కోరారు. అలాగే.. అలహాబాద్ హైకోర్టు జడ్జికే సంబంధించి పెండింగ్‌లో ఉన్న అభిశంసన నోటీసు గురించి కూడా గుర్తుచేశారు. దీనిపై స్పందించిన జగ్‌దీప్ ధన్‌ఖడ్.. ఈ ఘటన జరిగిన వెంటనే బయటకు రాకపోవడం తనను ఎక్కువగా బాధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే ఒక రాజకీయ నాయకుడి విషయంలోనో, అధికారి లేదా పారిశ్రామికవేత్త విషయంలోనో జరిగి ఉంటే వారిని వెంటనే లక్ష్యంగా చేసుకుంటారని ఆవేదన వెలిబుచ్చారు. మరోవైపు.. జడ్జి బదిలీతో ఈ వ్యవహారాన్ని ముగించలేరని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా వ్యాఖ్యానించారు. "జస్టిస్ వర్మ.. ఉన్నావ్ రేప్ కేసు సహా పలు తీవ్రమైన కేసులను వింటున్నారు. న్యాయవ్యవస్థపై దేశప్రజలకు ఉన్న నమ్మకాన్ని పోకుండా చూడాలంటే.. ఆయన ఇంట్లో దొరికిన డబ్బు ఎవరిదో, ఆయనకు ఎందుకు ఇచ్చారో కనిపెట్టాలి" అని ఆయన డిమాండ్ చేశారు. మాజీ సీజేఐ ఒకరు న్యాయదేవత కళ్లకున్న గంతలను తీసేస్తూ.. 'న్యాయం గుడ్డిది కాదు. అది అందరినీ సమానంగా చూస్తుంది' అని వ్యాఖ్యానించారని.. ఈ కేసులో ఆ విషయం రుజువు కావాలని పవన్ ఖేరా వ్యాఖ్యానించారు. దేశంలో ఈడీ, సీబీఐ కన్నా అగ్నిమాపక సిబ్బందే సమర్థంగా పనిచేస్తున్నారన్నారు.

డబ్బు కట్టలేం దొరకలేదు

**ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ చీఫ్ అతుల్ గార్గ్**

జస్టిస్ వర్మ ఇంట్లో కట్టల కొద్దీ డబ్బు దొరికిన వ్యవహారంపై దేశవ్యాప్తంగా దుమారం రేగుతుండగా.. ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ చీఫ్ అతుల్ గార్గ్ మాత్రం ఆయన ఇంట్లో తమ సిబ్బందికి అసలు డబ్బే దొరకలేదని చెప్పారు. శుక్రవారం ఈ అంశంపై ఆయన వివరణ ఇచ్చారు. "మార్చి 14న రాత్రి 11.35 గంటలకు.. జస్టిస్ వర్మ నివాసంలో మంటలు చెలరేగాయని పేర్కొంటూ మా కంట్రోల్ రూమ్‌కు కాల్ వచ్చిఇంది. 11.43 గంటలకల్లా రెండు అగ్నిమాపక శకటాలను ఆయన ఇంటికి పంపించాం. కాగితాలు, ఇతర వస్తువులు ఉన్న స్టోర్ రూమ్‌లో చెలరేగిన మంటలను మా సిబ్బంది 15 నిమిషాల్లో ఆర్పేశారు. వెంటనే దీనిపై పోలీసులకు సమాచారం అందించి.. మా సిబ్బంది అక్కణ్నుంచీ వచ్చేశారు. మా ఫైర్‌ఫైటర్లు అక్కడ ఎలాంటి నగదునూ కనుగొనలేదు" అని ఆయన స్పష్టం చేశారు.

## 'ఇదేమీ చెత్త బుట్ట కాదు..
## మాకెందుకు ఆ జడ్జి?'



**న్యూఢిల్లీ:** భారీ అవినీతి ఆరోపణలతో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీం కోర్టు కొలీజియం తీసుకున్న నిర్ణయంపై సదరు హైకోర్టు బార్ అసోసియేషన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఒక హైకోర్టులో అవినీతిని చేసిన జడ్జిని తమకెందుకు బదిలీ చేస్తున్నారంటూ ప్రశ్నించింది. అలహాబాద్ హైకోర్టుకు యశ్వంత్ వర్మను బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం తీసుకున్న నిర్ణయంపై ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ కు లేఖ రాసింది అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్. 'సుప్రీంకోర్టు కొలీజియం తీసుకున్న నిర్ణయం చాలా సీరియస్ అంశం. అలహాబాద్ హైకోర్టు ఏమైనా చెత్త బుట్టా.. ప్రస్తుతం యశ్వంత్ వర్మ అంశం చాలా తీవ్రమైనది. ప్రస్తుత పరిస్థితిపై విచారణ జరగాలి. అసలే అలహాబాద్ హైకోర్టుకు జడ్జిలు తక్కువగా ఉన్నారు. చాలా ఏళ్ల నుంచి అలహాలబాద్ హైకోర్టులో జడ్జిల కొరత తీవ్రంగా ఉంది. ఆ తరుణంలో అవినీతి మరకలు అంటుకున్న యశ్వంత్ సిన్హా మాకెందుకు? అంటూ సీజేఐకి రాసిన లేఖలో పేర్కొంది.

**రూ. 15 కోట్లు పైమాటే..?**

అయితే అగ్ని ప్రమాదంతో బయటపడిన జస్టిస్ యశ్వంత్ వర్మ కరెన్సీ కట్ల వ్యవహారం ఇప్పుడు దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఆ నోట్ల కట్టలు విలువ ఎంత ఉంటుందని ఇప్పటివరకూ అధికారంగా ప్రకటించకపోయినా, వాటి విలువ రూ. 15 కోట్లకు పైగా ఉంటుందని తెలుస్తోంది. నిజంగా ఒకవేళ ఆ నోట్ల కట్టల విలువ భారీ స్థాయిలో ఉంటే జడ్జి యశ్వంత్ వర్మ చిక్కుల్లో పడినట్లే. ఈ అంశంపై సీజెఫై సంజీవ్ ఖన్నా తీవ్రంగా దృష్టి సారించినట్లు సమాచారం. మార్చి 14వ తేదీన జస్టిస్ వర్మ ఇంట్లో లేని సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో మంటలను ఆర్పడానికి వచ్చిన అగ్ని మాపక సిబ్బంది నోట్ల కట్టలు కనిపించాయి. ఈ సమాచారాన్ని పోలీసులకు తెలపడంతో సీజ్ చేసి ఉన్నతాధికారులకు అందించారు. ఈ వ్యహహారం కాస్తా ఇప్పుడు సుప్రీంకోర్టుకు చేరింది. గతంలో అలహాబాద్ హైకోర్టు జడ్జిగా పని చేసిన అనుభవం ఉన్న యశ్వంత్ వర్మ.. బదిలీపై ఢిల్లీ హైకోర్టుకు వచ్చారు. తాజాగా నోట్ల కట్టల వ్యవహారం బయటపడటంతో వర్మ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటివరకూ యశ్వంత్ వర్మ స్పందించకపోవడంతో ఆయనపై వచ్చిన అవినీతి ఆరోపణలకు మరింత బలం చేకూర్చున్నట్లే అవుతుందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు.

## త్రిపురలో భాషా వివాదం..
## రోమన్ స్క్రిప్ట్ కోసం విద్యార్థులు డిమాండ్




**అగర్తలా:** ఈశాన్య రాష్ట్రమైన త్రిపురలో భాషా వివాదం చెలరేగింది. ఆ రాష్ట్ర అధికార భాషల్లో ఒకటైన కోక్‌బోరోక్‌కు రోమన్ లిపిని ఆమోదించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం అసెంబ్లీ ప్రారంభమైన తొలి రోజున రాజధాని అగర్తలాలో ట్విప్రా స్టూడెంట్స్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో భారీగా నిరసన చేపట్టారు. అసెంబ్లీ, హైకోర్టు, విమానాశ్రానికి వెళ్లే ముఖ్య రహదారులను బ్లాక్ చేశారు. దశాబ్దాల నాటి తమ డిమాండ్‌ను నెరవేర్చాలని గిరిజన విద్యార్థుల సంస్థ టీఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. కాగా, వందలాది మంది టీఎస్ఎఫ్, యూత్ టిప్రా ఫెడరేషన్ (వైటీఎఫ్) కార్యకర్తలు రహదారుల్లోని కీలక కూడళ్ల వద్ద గుమిగూడారు. కోక్‌బోరోక్‌కు రోమన్ స్క్రిప్ట్‌ను అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ మేరకు ప్లకార్డులు ప్రదర్శించారు. మరోవైపు అధికారిక రికార్డులు, విద్యలో ప్రస్తుతం వినియోగిస్తున్న బెంగాలీ లిపి స్థానంలో రోమన్ లిపిని అమలు చేయాలని గిరిజన విద్యార్థి సంఘం నేత డిమాండ్ చేశారు. స్థానికంగా పెద్దదైన గిరిజన వర్గానికి చెందిన ఈ లిపి ప్రాధాన్యతను గుర్తించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కాగా, విద్యార్థుల నిరసన వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో అసెంబ్లీకి వెళ్లేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు నిరసన విరమించాలని పోలీసులు, భద్రతా సిబ్బంది సూచించారు. లేకపోతే చట్టపరంగా చర్యలు చేపడతామని హెచ్చరించారు. అయితే తమ డిమాండ్ కోసం నిరసనను ఉధృతం చేస్తామని గిరిజన విద్యార్థి సంఘాలు స్పష్టం చేశాయి.

# వచ్చే ఏడాది ఇదేరోజుకి నక్సల్స్‌ని ఏరేస్తాం

**న్యూఢిల్లీ:** అంతర్గత భద్రత పటిష్టతకు బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని, 2026 మార్చి 21వ తేదీ నాటికి దేశంలో పూర్తిగా నక్సలిజాన్ని నిర్మూలిస్తామని కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా అన్నారు. జమ్మూకశ్మీర్‌లో తీవ్రవాదం, దేశంలో నక్సలిజంతో ఎదురవుతున్న సవాళ్లు, మాదకద్రవ్యాల బెడద, ఈశాన్య ప్రాంతంలోని సమస్యలపై కేంద్రం తీసుకుంటున్న చర్యలపై రాజ్యసభలో శుక్రవారంనాడు జరిగిన చర్చకు అమిత్‌షా సమాధానమిచ్చారు. బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వ హయాంలో నక్సల్స్ సమస్య నుంచి దేశానికి విముక్తి లభించనుందని చెప్పారు. 2026 మార్చి 21వ తేదీ నాటికి దేశాన్ని నక్సల్స్ బెడద నుంచి విముక్తి కల్పించడాన్ని తాము ఒక బాధ్యతగా తీసుకున్నామని చెప్పారు. నక్సలిజం ఒక రాజకీయ సమస్య మాత్రమేనని భావించే వారిని చూస్తే తనకు జాలి కలుగుతుందన్నారు.

"2014లో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు గత ప్రభుత్వం నుంచి సంక్రమించిన అనేక సమస్యలు దేశాభివృద్ధికి అవరోధాలుగా నిలిచాయి. దాదాపు నాలుగు దశాబ్దాలుగా దేశంలో అభివృద్ధి ముదుకు సాగలేదు. వీటిలో జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం, లెఫ్టిస్ట్ ఇన్‌సర్జెన్సీ, ఈశాన్య ప్రాంతంలో చొరబాట్లు వంటివి ఉన్నాయి. ఈ మూడు అంశాలతో 92,000 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మోదీ అధికారంలోకి వచ్చాక ఈ మూడింటి బెడద నిర్మూలించేందుకు చర్యలు చేపట్టింది" అని అమిత్‌షా అన్నారు. సరిహద్దులతో పాటు దేశ అంతర్గత భద్రతను పరిరక్షించేందుకు వేలాది మంది రాష్ట్ర పోలీసులు, కేంద్ర పారామిలటరీ జవాన్లు ఆత్మబలిదానాలు చేశారని, వారి సేవలు మరువలేనివని చెప్పారు.



**370 అధికరణ రద్దు తర్వాత..**

జమ్మూకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణను కేంద్రం రద్దు చేసిన తర్వాత ఉగ్రవాదంతో యువకుల ప్రమేయం దాదాపు కనుమరుగైందని చెప్పారు. పదేళ్ల క్రితం టెర్రరిస్టులు మరణిస్తే వారిని కీర్తిస్తూ అంత్యక్రియల ఊరేగింపులు జరిగేవని, ఇప్పుడు టెర్రరిస్టులు హతమైతే వారిని అక్కడికక్కడే పూడ్చిపెడుతున్నారని వివరించారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలు అనుభవిస్తూ వచ్చిన టెర్రరిస్టుల బంధువులను ఉద్యోగాల నుంచి తొలగించి గట్టి సందేశం ఇచ్చామని చెప్పారు. ఇప్పుడు కశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయని, థియేటర్ల తెరిచి ఉంటున్నాయని, పెట్టుబడులు, స్వయం ఉపాధి పొందుతున్న వారి సంఖ్య పెరిగిందని చెప్పారు. ఉగ్రవాదం వల్ల మరణాలు 70 శాతానికి పైగా తగ్గాయని అమిత్‌షా చెప్పారు. జి-20 సదస్సు, ముహర్రం ఊరేగింపు జరిగినట్టు వివరించారు. 2019 నుంచి 2024 వరకూ జమ్మూకశ్మీర్‌లో 40,000 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయని, 1.51 లక్షల మందికి స్వయం ఉపాధి కల్పించామని, ప్రోత్సాహకరమైన పారిశ్రామిక విధానంతో రూ.12,000 కోట్ల పెట్టుబడులు వచ్చాయని, రూ.1.1 లక్షల కోట్లు విలువచేసే ఎంఓయూలపై సంతాకలు జరిగాయని అమిత్‌షా వివరించారు.

## ఆ తీర్పు ముమ్మాటికీ తప్పే!
## సుప్రీం కోర్టుకు కేంద్ర మంత్రి విజ్ఞప్తి



**న్యూఢిల్లీ:** అలహాబాద్ హైకోర్టు జడ్జి రామ్ మనోహర్ మిశ్రా ఇచ్చిన తీర్పు ఇప్పుడు దేశవ్యాప్త చర్చకు దారి తీసింది. మహిళలను అభ్యంతకరంగా తాకడం లైంగిక దాడి కిందని రాదంటూ ఓ మైనర్ బాలిక కేసులో ఆయన తీర్పు ఇవ్వడం తెలిసిందే. అయితే తీర్పు సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా ఉన్నాయని అంటున్నారు కేంద్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి అన్నపూర్ణ దేవి. అలహాబాద్ హైకోర్టు తీర్పు సమ్మతం కాదన్న మంత్రి అన్నపూర్ణ.. దానిని పరిశీలించాలని సుప్రీం కోర్టును కోరారు. అలాంటి తీర్పులతో సమాజంలోకి తప్పుడు సందేశం వెళ్లే అవకాశం ఉందని ఆమె వ్యాఖ్యానించారు.

**అసలేం జరిగిందంటే..?**

2021 నవంబరులో.. ఉత్తరప్రదేశ్‌లోని కసగంజ్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ, తన మైనర్ కుమార్తెతో కలిసి బంధువుల ఇంటి నుంచి తిరిగివస్తోంది. అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు లిఫ్ట్ పేరిట ఆ బాలికను తమతో బైక్‌లపై తీసుకొచ్చారు. మార్గమధ్యంలో ఆ యువకులు అమ్మాయిపై అత్యాచారానికి యత్నించారు. ఆమెను అసభ్యంగా తాకుతూ వేధింపులకు గురిచేశారు. బాలిక అరుపులు విని అటుగా వెళుతున్నవారు రావడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. విషయం తెలుసుకున్న బాధితురాలి కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించడంతో నిందితులపై కేసు నమోదు చేశారు. అనంతరం ఈ కేసు అలహాబాద్ హైకోర్టుకు చేరింది. ఇటీవల దీనిపై విచారణ జరిపిన జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్రా సంచలన వ్యాఖ్యలు చేశారు. మహిళ ఛాతీని తాకినంత మాత్రాన.. పైజామా తాడు తెంపినంత మాత్రాన అత్యాచార యత్నం కిందకు రాదంటూ పేర్కొన్నారు. తద్వారా నిందితులు చేసిన నేరాలు పోక్సో చట్టంలోని సెక్షన్ 18, సెక్షన్ 376 కిందకు రావని చెబుతూనే.. అదే చట్టంలోని సెక్షన్ 9/10 (తీవ్రమైన లైంగిక వేధింపులు), సెక్షన్ 354-బి (మహిళల గౌరవాన్ని దెబ్బతీసే ఉద్దేశంతో దాడి) కింద కేసులు నమోదు చేసి విచారించాలని ఆదేశించారాయన.

# అసమానత్వం, వివక్షపై నిజం నిగ్గుతేలాలి

**న్యూఢిల్లీ:** కులగణన డిమాండ్‌ను లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి లేవనెత్తారు. అసమానత్వం, విపక్షపై నిజం నిగ్గుతేలాలంటే కులగణన కీలకమైన ముందడుగు అవుతుందని చెప్పారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ మాజీ చైర్మన్, విద్యావేత్త సుఖ్‌దేవ్ థోరట్‌తో తాను ముఖాముఖీ జరిపిన ఒక వీడియోను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో రాహుల్ పోస్ట్ చేశారు. "ప్రముఖ విద్యావేత్త, ఆర్థికవేత్త, దళిత అంశాలపై నిపుణుడు, తెలంగాణలో కులగణనపై అధ్యయన కమిటీ సభ్యుడు ప్రొఫెసర్ థోరట్‌తో సమగ్రమైన చర్చ జరిపాను. మహద్ సత్యాగహపైన, అడ్మినిస్ట్రేషన్, విద్య, బ్యూరోక్రసీ, వనరుల విషయంలో దళితులు జరుపుతున్న పోరాటంపైన చర్చించడం జరిగింది" అని రాహుల్ తెలిపారు. ఇది సమానత్వం, గౌరవానికి సంబంధించిన పోరాటమని, 98 ఏళ్ల క్రితం మొదలైన ఈ పోరాటం ఇప్పటికీ కొనసాగుతోందని అన్నారు. అసమానత్వం, వివక్షపై నిజానిజాలు బయటపడాలంటే కులగణన అనేది కీలకమైన అడుగు అవుతుందని, దీనిని వ్యతిరేకిస్తున్నా వారు మాత్రం నిజాలు బయటపడరాదని కోరుకుంటున్నారని అన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ కల ఇప్పటికీ అసంపూర్తిగానే మిలిగిపోయిందని, ఇది గతానికి చెందిన పోరాటం మాత్రమే కాదని, ఇప్పటికీ పోరాటం సాగుతోందని, పూర్తి శక్తియుక్తులతో అంతా కలిసి



పోరాడాలని రాహుల్ అన్నారు.

**రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ మండిపాటు**

రాహుల్ వ్యాఖ్యలను బీజేపీ తప్పికొట్టింది. రాహుల్ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ ఆశ్రితపక్షపాతం, ఫ్యూడల్ మనస్తత్వాన్ని చాటుతోందని ఆ పార్టీ నేత సీఆర్ కేశవన్ అన్నారు. ప్రజాజీవితంలో కఠోర శ్రమతో ఎంతో పేరు తెచ్చుకున్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ నేతలను నిరంతరం అవమానపరచే చరిత్ర కాంగ్రెస్‌దని విమర్శించారు.

# ఏడుకొండల్లో వ్యాపారీకరణను అనుమతించం

-మొదటిపేజీ తరువాయి

అనంతరం కుటుంబసభ్యులతో కలిసి చంద్రబాబు అన్నప్రసాదాలు స్వీకరించారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. "నా ప్ర?థమ ప్రాధాన్యం శ్రీవేంకటేశ్వరస్వామి. ఏడుకొండలు శ్రీవారి సొంతం. వీటిని అపవిత్రం చేయకూడదు, అందువల్లే గత ప్రభుత్వంలో ముంతాజ్, ఏఆర్‌కే, దేవ్‌లోక్‌కు ఏడుకొండలకు అనుకుని ఉన్న ప్రాంతంలో ఇచ్చిన 35.32 ఎకరాల స్థలాన్ని రద్దు చేస్తున్నాం." అని చంద్రబాబు వెల్లడించారు.

వివిధ ప్రాంతాల్లో హెూటళ్లు కడుతున్న ఒబెరాయ్ సంస్థ, అలిపిరిలో తమ హెూటల్ పేరు మారుస్తామని, శాకాహారం మాత్రమే పెడతామని చెప్పినప్పటికీ ఏడుకొండలు ప్రాంతంలో ప్రైవేట్ వ్యక్తులు ఉండకూడదని తేల్చిచెప్పామన్నారు. అవసరమైతే రోడ్డుకు అవతలి వైపు నిర్మించుకోవాలని సూచించానని చెప్పారు. ఏపీ టూరిజం పరిధిలోని స్థలాన్ని కూడా టీటీడీకే అప్పజెప్పేలా చర్యలు తీసుకునే ఆలోచన చేస్తున్నామన్నారు. "అమరావతిలో ఇటీవల జరిగిన శ్రీవారి కల్యాణం రాజధానికి నూతన శోభను తెచ్చింది. ఈ సందర్భంగా నేను నూతన సంకల్పం చేశాను. చాలా గ్రామాల్లో ఆలయాలు లేవు. వాటి నిర్మాణం కోసం నూతన ట్రస్టును ఏర్పాటు చేస్తాం. శ్రీవాణిట్రస్టుకు వచ్చే నిధులను కూడా ఈ నూతన ట్రస్టులో పెడతాం. ప్రస్తుతానికి ఈ ట్రస్టుకు 'శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాల నిర్మాణ నిధి' అనే పేరును అనుకుంటున్నాం. త్వరలోనే టీటీడీ ఓ మంచి పేరు నిర్ణయిస్తుంది." అని చంద్రబాబు తెలిపారు. హథిరాంజీమఠం భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆలయాల నిర్వహణలో స్థానిక భక్తుల భాగస్వామ్యం పెంచుతామని తెలిపారు. టీటీడీ తరహాలో మిగిలిన ఆలయాలకు స్వయంప్రతిపత్తి కల్పిస్తారా అన్న ప్రశ్నకు బదులిస్తూ.. రాష్ట్రంలో అద్భుత టెంపుల్ ఎకో సిస్టమ్ ఉందని తెలిపారు. " రూ.20 కోట్ల నుంచి రూ.వంద కోట్ల వరకు రెవెన్యూ వచ్చే ఆలయాలు ఏడు, రూ.ఐదు కోట్లపైబడి ఆలయాలు వచ్చేవి 13 ఉన్నాయి. రాష్ట్రంలోని ఆలయాలను అభివృద్ధి చేసి టూరిస్టులకు అనుకూలంగా మలుస్తాం." అని చంద్రబాబు తెలిపారు. శ్రీవారి ఆలయాల్లో పనిచేసే వ్యక్తులు హిందువులే అయి ఉండాలని స్పష్టం చేశారు.

**అరెస్టు చేయిస్తానని చెప్పా..**



గతంలో అధికారులు తన వద్దకు వచ్చి తిరుమలలో నీళ్లు లేని కారణంగా, మూడు నెలల పాటు ఆలయాన్ని మూసివేయాలని కోరారని చంద్రబాబు గుర్తుచేశారు. "వాళ్లను గట్టిగా హెచ్చరించా. 90నుంచి 95 రోజుల్లో కల్యాణి డ్యాం నుంచి తిరుమలకు నీళ్లు తీసుకువచ్చేలా పైప్‌లైన్ ఏర్పాటుచేయండి. లేకుంటే అరెస్ట్ చేయిస్తానని వార్నింగ్ ఇచ్చాను." అని తెలిపారు. అంతకుముందు.. చంద్రబాబు కుటుంబసభ్యులకు మహాద్వారం వద్ద టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఆలయ అర్చక బృందం ఇస్తికఫాల్ స్వాగతం పలికారు.

**అన్నదానం మా ఆనవాయితీ: బాబు**

"మా ఇంటి కులదైవం వేంకటేశ్వరస్వామి. మా దేవాన్ష్ పుట్టినప్పటి నుంచీ ఏటా తిరుమలలో అన్నదానం చేయడం ఆనవాయితీగా పెట్టుకున్నాం." అని సీఎం చంద్రబాబు వివరించారు. టీటీడీలో అన్నదానం ట్రస్టును ఎన్టీఆర్ ప్రారంభించారనీ, ఇప్పటివరకు ఇబ్బందులు లేకుండా అన్నదాన కార్యక్రమాలు సజావుగా సాగుతున్నాయన్నారు. ఈ పథకంలో ప్రస్తుతం రూ.2,200 కోట్ల కార్పస్ ఫండ్ ఉందని, ప్రతి రోజూ ఎంతోమంది భక్తులు ట్రస్టుకు విరాళాలు ఇవ్వడంతోపాటు మరికొందరు ఒకరోజు అన్నప్రసాద వితరణకు ముందుకు వస్తున్నారని సీఎం తెలిపారు. శ్రీవారి ఆలయ ప్రక్షాళనతోనే పరిపాలన ప్రారంభించానని, అందులోభాగంగా తొలి పోస్టింగ్ టీటీడీ ఈవోగా శ్యామలరావును ఇచ్చానని గుర్తుచేశారు. రాయలసీమలో పెద్దగా ఆస్పత్రులు లేని విషయం గుర్తించి.. ప్రాణదానం ట్రస్ట్‌ను ఏర్పాటుచేశామన్నారు. ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాల్లో లోపాలుంటే సరిచేస్తామన్నారు.

**చీరపై రామాయణ ఘట్టాలు**

దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సమయంలో నారా బ్రాహ్మణి కటుక్టున్న చీర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వాల్మీకి రామాయణాన్ని చీరపై ప్రత్యేక డిజైన్‌గా ముద్రించారు. రామాయణ ఘట్టాలతో పాటు వృక్షాలు, శంఖు చక్ర నామాలతో డిజైన్ చేశారు. ఆమె ధరించిన చీరను భక్తులు ఆశ్చర్యంగా చూశారు.

**భక్తులకు అల్పాహారం వడ్డించిన దేవాన్ష్**

'దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా ఆనవాయితీగా ఈ ఏడాది కూడా ఒకరోజు అన్నప్రసాదాలకయ్యే ఖర్చు రూ.44 లక్షలు అన్నప్రసాదం ట్రస్టుకు విరాళంగా ఇచ్చాం. ఆ తర్వాత అన్నదాన కేంద్రంలో తాత, నాయనమ్మతో కలిసి దేవాన్ష్ భక్తులకు అల్పాహారాన్ని స్వయంగా వడ్డించాడు' అని నారా బ్రాహ్మణి తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు.

# స్పీడందుకున్న విశాఖ మెట్రో పనులు..

-మొదటిపేజీ తరువాయి

మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. ఇవాళ వీఎంఆర్డీఏ పరిధి మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష చేశామని అన్నారు. గతంలో స్వార్థం కోసం మాస్టర్ ప్లాన్ రూపొందించారని చెప్పారు. ఫైనల్ చేసిన మాస్టర్ ప్లాన్‌ను ఆన్‌లైన్‌లో ఉంచుతామని మంత్రి నారాయణ అన్నారు.

ప్రజల నుంచి అభిప్రాయం తీసుకుని మాస్టర్ ప్లాన్ నాలుగు నెలల్లో ఫైనల్ చేస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు. మాస్టర్ ప్లాన్ అంటే రాబోయే 30 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని చేయాలని చెప్పారు. కొన్ని చోట్ల రోడ్ల పరిధిని పెంచడంపై అధికారులతో చర్చించినట్లు చెప్పారు. మెట్రో రైల్ కూడా మాస్టర్ ప్లాన్‌లో భాగమేనని తెలిపారు. 8 క్రాస్ రోడ్ల దగ్గర ఫ్లై ఓవర్లు ఉన్నాయని చెప్పారు. ఇక్కడ డబుల్ డెక్కర్ రోడ్లు ప్లాన్ చేసేలా ప్రజా ప్రతినిధులు తమ అభిప్రాయాలను చెప్పారని అన్నారు. టీడీఆర్ బాండ్ల విషయం అందరికీ తెలుసునని చెప్పారు. టీడీఆర్ బాండ్లపై అన్ని మున్సిపాలిటీల్లో స్పెషల్ డ్రైవ్ జరుగుతోందని తెలిపారు. త్వరలోనే ఈ సమస్యలు పరిష్కారం అవుతాయని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

టౌన్ ప్లానింగ్‌పై చర్చ..

టౌన్ ప్లానింగ్‌లో తీసుకువచ్చిన సంస్కరణల అమలు, మరిన్ని మార్పులపై మంత్రి నారాయణ చర్చించారు. భవన నిర్మాణాలకు అనుమతులను మరింత సులభతరం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ సమావేశానికి మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్, టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యులత, క్రెడాయ్, నరెడ్కో, ఎల్టీపీ అసోసియేషన్ల ప్రతినిధులు హాజరయ్యారు. భవన




నిర్మాణాలకు సెట్ బ్యాక్ నిబంధనలు సరళతరం చేసేలా చర్చించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఇటీవల తీసుకువచ్చిన సంస్కరణలను పగడ్బందీగా అమలు చేయడంపై మంత్రి నారాయణ పలు సూచనలు జారీ చేశారు.

కీలక నిర్ణయాలు తీసుకున్నాం: కొణతాల రామకృష్ణ

వైజాగ్ అభివృద్ధిపై ఇవాళ జరిగిన సమీక్షలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నామని మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ తెలిపారు. గతంలో ఇష్టానుసారంగా మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేశారని అన్నారు. ప్రజల అభిప్రాయం తీసుకుని మాస్టర్ ప్లాన్ మళ్లీ రూపొందించే ఆలోచన చేశామని చెప్పారు. నాలుగు నెలల్లో మాస్టర్ ప్లాన్ పక్కాగా ఉండేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. 22ఏ భూములు, తాగు నీటి సమస్యలు, బీచ్ క్యారీడర్, ఇలా కొన్ని సమస్యలు ఉన్నాయన్నారు. చాలా కాలంగా అనకాపల్లి, గాజువాక భూ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటి పరిష్కారానికి మంత్రి నారాయణ ఆమోదం తెలిపారని కొణతాల రామకృష్ణ అన్నారు.

పల్లా శ్రీనివాసరావు ఏమన్నారంటే..

భోగాపురం ఎయిర్ పోర్ట్ మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష చేయడం మంచిదేనని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. కొన్ని రోడ్లకు పక్కన చిన్న చిన్న స్థలాలు ఉన్నవారు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. వీటికి సంబంధించి ఇబ్బందులు లేకుండా చూడమని మంత్రి నారాయణను కోరామని అన్నారు. అధికారులు మారడం వల్ల అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష విస్తృతంగా చేయాలని చెప్పామని పల్లా శ్రీనివాసరావు అన్నారు.

**వైజాగ్ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి: ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు**


విజన్ 2047పై ఫోకస్ పెట్టినట్లుగానే వైజాగ్ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తెలిపారు. రాష్ట్రంలో మున్సిపల్ శాఖా చాలా కీలకమని అన్నారు. వైజాగ్ మాస్టర్ ప్లాన్‌లో కొన్ని లొసుగులు ఉన్నాయని చెప్పారు. ఇవన్నీ సెట్ రైట్ చేయాలని కోరామన్నారు. వీఎంఆర్డీఏ నుంచి కార్పొరేట్ ఆస్పత్రికి భూములు ఇచ్చి పదిశాతం వరకు ఉచిత వైద్యం చేయాలని చెప్పామని.. అది జరగడం లేదని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు.

# ప్రజలకు కూల్ న్యూస్

-మొదటిపేజీ తరువాయి

ఎండల మరింత తీవ్రం అవుతాయనే ఓ విధమైన ఆందోళన ఏపీ ప్రజల్లో వ్యక్తమవుతోంది.

మరోవైపు ఒడిశా మధ్య ప్రాంతాల నుంచి దక్షిణ విదర్భ వరకు దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో ఏర్పడిన ద్రోణి బలహీన పడింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల్లో వాతావరణం మారనుంది. ఉత్తర కోస్తాలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది.ఇక దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. అలాగే రాయలసీమలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని తుఫాన్ హెచ్చరికల కేంద్రం వెల్లడించింది. ఇంకోవైపు తెలంగాణలో సైతం వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. మార్చి 21 నుంచి 23వ తేదీ వరకు మూడు



రోజుల పాటు హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఇక వర్షాల కారణంగా.. వేడి తీవ్రతే కాదు.. వడగాలులు సైతం తగ్గుతాయి. దీంతో రెండు రోజుల పాటు ప్రజలకు వడగాలుల నుంచి ఉపశమనం పొందనున్నారు.

## పోసానికి బెయిల్ మంజూరు

-మొదటిపేజీ తరువాయి

ప్రముఖ రచయిత,నటుడు పోసాని కృష్ణ మురళి బెయిల్ పిటిషన్‌పై గుంటూరు కోర్టులో బుధవారం వాదనలు జరిగాయి. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు తీర్పును ఈనెల 21కి వాయిదా వేసిన సంగతి తెలిసిందే. గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న పోసాని తనకు బెయిల్ ఇవ్వాలంటూ ఆయన తరపు న్యాయవాదులు గుంటూరు సీఐడీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పోసాని బెయిల్ పిటిషన్‌పై రెండ్రోజుల క్రితం విచారణ జరగగా .. న్యాయస్థానం ఇవ్వాల్టికి వాయిదా వేసింది. కోర్టు ఉత్తర్వుల మేరకు.. గుంటూరు జిల్లా జైలులో ఉన్న ఆయన్ను మంగళవారం కస్టడీలోకి తీసుకున్న సీఐడీ పోలీసులు జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం సీఐడీ కార్యాలయంలో ఉ.11 గంటల నుంచి మ.2 గంటల వరకు విచారించారు. ఆ తర్వాత గుంటూరు జిల్లా కోర్టు ఆవరణలోని స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ ఫర్ ప్రొహిబిషన్/ఎక్సైజ్ కోర్డులో హాజరుపరిచారు. అక్కడ్నుంచి పోసానిని తిరిగి గుంటూరు జిల్లా జైలుకి తరలియిచారు. ఈ కేసులో బుధవారం కోర్టులో విచారణ జరిగింది. శుక్రవారం తిరిగి విచారించిన కోర్టు.. పోసానికి బెయిల్ మంజూరు చేసింది.

**ఫిబ్రవరి 26వ తేదీ అరెస్టు.. ఆపై వేధింపులు**

కాగా, ఫిబ్రవరి 26వ తేదీని పోసానిని హైదరాబాద్ లో అరెస్ట్ చేశారు. అనంతరం కూటమి సర్కార్ ఆదేశాలతో రోజుకో కేసు పెట్టి పోసానిని వేధిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కేసులు నమోదు చేస్తూ తమ అహంకార పూరిత వైఖరిని ప్రదర్శిస్తోంది కూటమి ప్రభుత్వం. పోసానికి ఆరోగ్యం బాగోలేకపోయినా వరుస కేసులు పెట్టి మానవత్వం లేకుండా వ్యవహరిస్తోంది. ఇప్పటివరకూ 19 కేసులు పెట్టింది కూటమి ప్రభుత్వం.

## 'చంద్రబాబు శకుని పాత్ర వేస్తే బాగుండేది'

**గుంటూరు :** విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో ఏపీ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆ సాంస్కృతి కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు శకుని పాత్ర వేస్తే బాగుండేదని, ఆయన ఆ పాత్రకు బ్రహ్మాండంగా సరిపోతారని మాజీ మంత్రి అంబటి రాంబాబు సెటైర్లు వేశారు. ఏపీ బడ్జెట్ సమావేశాలపై అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడారు. "2025 బడ్జెట్ సమావేశాలు 16 రోజుల పాటు జరిగాయి. ప్రతిపక్షం లేని శాసన సభ సమావేశాలు చప్పగా సాగాయి. ప్రతిపక్ష హెూదా ఇవ్వకపోడంతో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు సభకు వెళ్ళలేదు. వైఎస్సార్‌సీపీ సభ్యుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక భయంతో ప్రతిపక్ష హెూదా ఇవ్వలేదు. సమావేశాలు కూటమి నేతలు ఒకరినొకరు పొగుడుకోవడానికే సరిపోయింది. శాసన మండలిలో ప్రతిపక్షం ప్రశ్నలు సంధించింది. ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను మండలిలో మా సభ్యులు ఎండగట్టారు. ఒక్క క్వింటా మిర్చిని ఈ ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. బెల్ట్ షాపులు ఊరూరా ఉన్నాయి. చంద్రబాబు ప్రభుత్వం ఎంతో దౌర్భాగ్యపు స్థితిలో పని చేస్తుందో స్వంత పార్టీ సభ్యులే శాసన సభలో చెప్పారు. ప్రతిపక్ష సభ్యులు దొంగచాటుగా సంతకం చేయాల్సిన అవసరం ఏముంది. ప్రతిపక్షం హెూదా ఇవ్వండి. స్పీకర్ అయన్నపాత్రుడు వైఎస్ జగన్ గురించి ఏవిధంగా మాట్లాడారో అందరూ చూశారు. అచ్చెన్నాయుడు ఏటువంటి వ్యాఖ్యలు చేశారో అందరికి తెలుసు. ప్రజా సమస్యలపై పోరాటం మాకు ముఖ్యం. స్పీకర్,డిప్యూటీ స్పీకర్ శాసన సభకు పవిత్రత లేకుండా చేశారు. వైఎస్సార్ జిల్లాను వైఎస్సార్ కడప జిల్లాగా మార్చి శునకానందం పొందుతున్నారు.మంచి మిత్రుడు అని వైఎస్ గురించి చంద్రబాబు చెబుతాడు. మరి ఆయన పేరుపై ఎందుకంత కోపం. శాసన సభ్యుల వేసిన స్కిట్స్‌లో కూడా జగన్ పేరు మర్చిపోలేకపోయారు. ఆ స్కిట్‌లో చంద్రబాబుకు శకుని పాత్ర ఇస్తే బాగుండేది. ఆయన శకుని పాత్రకు బ్రహ్మాండంగా సరిపోతారు' అని సెటైర్లు వేశారు.

## ఏపీలో ఆపరేషన్ గరుడ..

-మొదటిపేజీ తరువాయి

మెడికల్ షాపుల్లో అక్రమ మత్తుపదార్థాలు ఉన్నాయా అనే దానిపై అధికారులు తనిఖీలు చేపట్టారు. ప్రకాశం జిల్లాలో ఆపరేషన్ గరుడలో భాగంగా ఈగల్ టీమ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ ఆధ్వర్యంలో జిల్లాలో మెడికల్ షాపులపై దాడులు నిర్వహిస్తున్నారు. మెడికల్ షాపుల్లో అధికారులు సోదాలు చేస్తున్నారు.

కడప: నగరంలో ఆపరేషన్ గరుడ జోరుగా సాగుతోంది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు మెడికల్ షాప్‌లపై దాడులు చేస్తున్నారు. డీజీపీ ఆదేశాల మేరకు ఏఎస్పీ శ్రీనివాసుల రావు ఆధ్వర్యంలో దాడులు జరుగుతున్నాయి. కడపలోని మెడికల్ షాపుల్లో అక్రమ మత్తుపదార్థాలు ఉన్నాయని సమాచారం మేరకు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కడప, ప్రొద్దుటూరు, అన్నమయ్య జిల్లాలోని రాజంపేట, మదనపల్లెలో దాడులు నిర్వహిస్తున్నామని తెలిపారు. మెడికల్ దుకాణాల్లో సరైన రికార్డులు ఉన్నాయా లేదా అని తనిఖీలు నిర్వహించామన్నారు. మత్తును కలిగించే మందులు అమ్మడం నేరం కాకపోయినా వైద్యుల పర్యవేక్షణ, ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మడం నేరమని తెలిపారు. పలు మెడికల్ దుకాణాలపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

నెల్లూరు: నగరంలో కెమిస్ట్రీ అండ్ డ్రగ్ దుకాణాలపై విజిలెన్స్, డ్రగ్స్ కంట్రోల్ అధికారులు దాడులు నిర్వహించారు. యువకులకు మత్తు పదార్థాల అక్రమ అమ్మకాలను అడ్డుకోవాలంటూ ఆదేశాలు జారీ చేశారు. మెడికల్ షాపులలో మత్తు మాత్రలు అక్రమంగా అమ్మిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విజిలెన్స్, డ్రగ్స్ కంట్రోలర్ శాఖ, పోలీసుశాఖ ఆకస్మిక తనిఖీలతో మందుల షాపు దుకాణాదారులు ఖంగుతిన్నారు.

అనంతపురం: విజిలెన్స్ అండ్ ఫోర్స్ మెంట్, డ్రగ్స్ అధికారులు మెడికల్ షాపుల్లో సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. నగరంలోని సప్తగిరి సర్కిల్, టవర్ క్లాక్, శ్రీ కంఠం సర్కిల్‌లలో ఒకే సమయంలో మెడికల్ షాపుల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. మెడికల్ షాపుల్లోని బిల్లులను, అనధికార మందులను వివరాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న తనిఖీల్లో భాగంగా మెడికల్ షాపుల్లో దాడులు జరుగుతున్నాయి. ఈ దాడులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ప్రసాద్ వివరాలను వెల్లడించారు. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. శ్యాంపుల్ డ్రగ్స్ అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్‌ఆర్‌ఎక్స్ (%చీ=ఇ%) డ్రగ్స్‌ను డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మకూడదని.. వీటి వివరాలను ఆరా తీస్తున్నామని ప్రసాద్ వెల్లడించారు. రాజమండ్రి: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మెడికల్ ఏజెన్సీలు, మందుల షాపులపై విజిలెన్స్ , డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, ఈగల్ బృందాలు దాడులు నిర్వహించారు. రాజమండ్రి గణేష్ చౌక్ తిరుమల శ్రీనివాస్ మెడికల్ ఏజెన్సీలో విజిలెన్స్ ఎస్పీ ఎం.స్నేహిత, డ్రగ్స్ ఏడీ నాగమణి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. డీజీపీ ఆదేశాలతో మెడికల్ షాపులలో నాలుగు ప్రత్యేక బృందాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రాజమండ్రిలో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా తిరుమల ఏజన్సీలో విక్రయిస్తున్న ట్రమడాలు, మత్తు మందు 255 ఇంజక్షన్లను విజిలెన్స్ ఎస్పీ స్నేహిత పట్టుకున్నారు. యువత కొంతమంది తప్పుడుగా వైద్యం కోసం వినియోగించే మత్తు కలిగించే మెడిసిన్స్‌ను విరివిగా వాడుతున్నట్టు సమాచారం అందిందని విజిలెన్స్ ఎస్పీ స్నేహిత తెలిపారు. అందుకే డీజీపీ ఆదేశాలతో జిల్లాలో 16 చోట్ల దాడులు చేస్తున్నామన్నారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ ఏజెన్సీలో, మెడికల్ షాపులలో ట్రమాడాల్ ఇంజక్షన్లు, మత్తు కలిగించే సిరఫ్‌లు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తూర్పుగోదావరి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ స్నేహిత హెచ్చరించారు.

విజయవాడ: నగర వ్యాప్తంగా మెడికల్ షాపులపై ఈగల్ టీమ్ దాడులు నిర్వహించారు. ఈగల్ టీమ్ ఐజీ రవికృష్ణ ఆధ్వర్యంలో దాడులు కొనసాగాయి. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా దాడులు నిర్వహిస్తున్నామని.. మొత్తం 100 టీమ్స్‌తో దాడులు చేస్తున్నామన్నారు. గంజాయి, డ్రగ్స్‌పై ఈగల్ టీమ్ ఉక్కుపాదం మోపుతోందని తెలిపారు. యువత డ్రగ్స్, గంజాయి అందుబాటులో లేకపోవడంతో మత్తు టాబ్లెట్స్‌కు బానిసలుగా మారుతున్నారన్నారు. మెడికల్ షాపు నిర్వాహకులు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు టాబ్లెట్స్ అమ్ముతున్నారన్నారు. యువత మత్తు టాబ్లెట్స్ తీసుకొని మత్తులో జోగుతున్నారని, మత్తులో యువత నేరాలవైపు అడుగులు వేసే అవకాశం ఉందని తెలిపారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు టాబ్లెట్స్ మెడికల్ షాప్ నిర్వాహకులు అమ్మితే చట్టపరమైన చర్యలు చేపడుతామని.. క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని రవికృష్ణ హెచ్చరించారు.

శ్రీకాకుళం: జిల్లాలో పలు మెడికల్ షాపుల్లో ఆపరేషన్ గరుడ కొనసాగుతోంది. జిల్లా కేంద్రంలో నాలుగు చోట్ల డ్రగ్ కంట్రోల్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు.

ఏలూరు జిల్లా : ద్వారకాతిరుమల మెడికల్ షాపులలో డ్రగ్, విజిలెన్స్, పోలీస్, ఈగల్ టీం ఆధ్వర్యంలో తనిఖీలు కొనసాగుతున్నాయి. కర్నూలు: జిల్లాలోని నంద్యాల ఆదోనిలో ఆపరేషన్ గరుడ కొనసాగుతోంది.

# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు





**గౌడ్ సొసైట్ ప్రెసెండెంట్ వల్లపు దాస్ కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్ విందు**

**ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు**

స్వర్ణసాగరం సూర్యాపేట జిల్లా మార్చ్ / 21

హుజూర్ నగర్ పట్టణం శ్రీనగర్ కాలనీలోని మజీద్ – మిర్ తాహేర్ అలి నందు ఇఫ్తార్ ఫ్రూట్ దావత్ ఏర్పాటు చేసిన గౌడ్ సొసైట్ ప్రెసెండెంట్ వల్లపు దాస్ కృష్ణ గౌడ్ 19 వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి అనంతరం వారు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొనటం చాలా ఆనందంగా ఉంది అని అలాగే హిందూ ముస్లిం అని తారతమ్యం లేకుండా అందరూ కలిసి మెలిసి సోదర భావం తో మెలగాలని అని భావించారు అందరూ సుఖ శాంతులతో కలిసి మెలిసి ఉండాలి అని అల్లాని ప్రార్థించడంజరిగింది.ఈ ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కోతిసంపతి రెడ్డి పాల్గొని 19వ వార్డు అభివృద్ధిలో భారీ నీటి పారుదల శాఖ నలమాధ ఉత్తంకుమార్ రెడ్డి సహకారంతో డ్రైనేజీ రోడ్లు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని 19 వ వార్డు వల్లపు దాసు కృష్ణ గౌడ్ సహకారంతో అభివృద్ధి పనులను చేపడతామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మత పెద్దలు ముక్తి సబ్ ఖాసిం ఖాన్ కాశి మల్లీ ఆసిఫ్ షేక్ మీరావాలి సత్తార్ షేక్ రఫీ రసూల్ అబ్దుల్లా వల్లపు దాసు వెంకటేశ్వర్లు వల్లభ దాసు రమేష్ జబ్బార్ బషీర్ జాఫర్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి .. డీపీఓ సుధాకర్ రావు



ఐరాల మార్చి 21 స్వర్ణ సాగరం

ఐరాల మండలం శుక్రవారం నాడు చిత్తూరు జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు ఐరాల మండలం లోని 35.ఎర్లంపల్లి, ఐరాల, పాతపల్యం , నాగవాండ్లపల్లి పంచాయతీ లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మండల ఆఫీసు నందు పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి అన్ని గ్రామాలు , మరియు రోడ్డు పక్కలా పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని , అన్ని చెత్త నుండి సంపద కేంద్రాలను వినియోగం లోకి తేవాలని ఆదేశించారు కార్యదర్శులకు సంబంధిత అధికారులకు పలు సూచనలు సలహాలను తెలియజేశారు, కార్యక్రమంలో విస్తరణ అధికారి కుసుమ కుమారి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల పరిరక్షణ పై సమావేశం



**-తహసిల్దార్**

అమరాపురం స్వర్ణ సాగరం మార్చి 21

మండలంలోని ప్రభుత్వ భూములను పరిరక్షణ చేసుకుందామని అమరాపురం తహసీల్దార్ లక్ష్మీనరసింహ అధ్యక్షతన శుక్రవారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమం నందు ఎస్సై ఇషాక్ భాషా ఇరిగేషన్ అధికారి భార్గవ్ ,ఈవో ఆర్ డి నాగమముని, పి ఆర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఇరిగేషన్ దేవదాయ శాఖ,పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి,అటవీశాఖ, మరియు రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను పరిరక్షణ చేసుకోవడానికి ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు కన్యాక్రాంతం కాకుండా ముఖ్యంగా ఇతరులు కబ్జా చేయడానికి ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఆయా శాఖల భూములపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయి జాయింట్ యాక్షన్ కమిటీలో తహసిల్దార్, ఎంపీడీవో, ఎస్సై ఇరిగేషన్ ,ఫారెస్ట్, దేవాదాయ శాఖ,ఆర్ అండ్ బి తదితర శాఖల సమన్వయంతో ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పూతలపట్టు తాసిల్దార్ పి రమేష్ బాబు

పూతలపట్టు స్వర్ణ సాగరం మార్చి 21



పూతలపట్టు మండల తాసిల్దారుగా పి రమేష్ బాబు పదవీ బాధ్యతలు శుక్రవారం చేపట్టారు ఈయన ఇంతకు మునుపు ఎదురు కుప్పం మండలంలో తాసిల్దారుగా విధులు నిర్వహిస్తూ బదిలీపై పూతలపట్టు తాసిల్దారుగా బాధ్యతలు చేపట్టారు ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు

## విద్యుత్ సబ్ స్టేషన్ కు స్థలాన్ని చూపండి



అమరాపురం స్వర్ణ సాగరం మార్చి 21

మండల పరిధిలోని చిట్టనడుకు గ్రామం వద్ద విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణమునకు స్థలాన్ని చూపాలని స్థానిక తహసీల్దార్ లక్ష్మీనరసింహంకు విద్యుత్ ఏఈ సిద్దేశ్వర శుక్రవారం వినతి అందజేశారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏ ఈ మాట్లాడుతూ రైతుల లో వోల్టేజ్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం విద్యుత్ సబ్ స్టేషన్ ను మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం స్థలం లేని కారణంగా పనులు ప్రారంభం కాలేదని తహసిల్దార్ ప్రత్యేక చొరవ తీసుకుని రైతులకు ఉపయోగపడే విధంగా స్థలాన్ని చూపాలని కోరారు. దీనిపై స్థానిక తహసిల్దార్ స్పందించి సత్వరమే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

## ఎలుగుబంటి దాడిలో ఇద్దరికి గాయాలు





అమరాపురం స్వర్ణ సాగరం మార్చి 21

మండల పరిధిలో కే.శివరం గ్రామ పంచాయతీలోని శివరం మరియు శివరం గొల్లహట్టి గ్రామాల పరిధిలో పొలం వద్ద పనులు చేసుకుంటున్న మహంతేష్ మరియు తిమ్మక్కల పైన శుక్రవారం మధ్యాహ్నం ఎలుగుబంటి దాడి చేసి గాయపరిచినట్లు ఆయా గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. గొల్లహట్టి సమీపంలోకి ఇక్కడి నుంచి వచ్చిన ఎలుగుబంటి పొలంలో పనులు చేస్తున్న తిమ్మక్కపైన దాడి చేయగా చూసిన ప్రజలు కేకలు వేయడంతో శివరం గ్రామం వైపు వచ్చి తోటలో పనిచేస్తున్న మహంతేష్ పైన దాడి చేసింది. గొర్రె కాపర్లు కేకలు వేయడంతో శివరం చెరువు సమీపంలోని పొదల్లో దాక్కోనట్లు ప్రజలు తెలిపారు. స్థానిక వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, అటవీ శాఖ మరియు పోలీస్ అధికారులకు సమాచారం అందించడంతో తక్షణం రంగంలోకి దిగిన పోలీస్ హెడ్ కానిస్టేబుల్ మధుసూదన్, కానిస్టేబుల్ శ్రీనాథ్ , ఫారెస్ట్ అధికారి తదితరులు ఎలుగుబంటి ఆచూకీ తెలుసుకోవడానికి కృషి చేస్తున్నట్లు సమాచారం. గాయాల పాలైన ఇరువురిని వైద్య సేవల కోసం ఆసుపత్రులకు తరలించినట్లు స్థానిక నాయకులు తెలిపారు.

## కలెక్టరేట్ లో మహిళా ఉద్యోగుల ఫిర్యాదుల పెట్టెను ప్రారంభించిన జిల్లా కలెక్టర్, జేసి

చిత్తూరు,స్వర్ణసాగరం,మార్చి21



ఏపిజేఏసి అమరావతి,చిత్తూరు మహిళా విభాగం వారి ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో మహిళా ఉద్యోగుల ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేయగా గురువారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ కె. మోహన్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, కలెక్టరేట్ ఏ ఓ కులశేఖర్, ఏపిజేఏసి చిత్తూరు జిల్లా మహిళా విభాగం ప్రెసిడెంట్ జయంతి, జనరల్ సెక్రెటరీ లత, కొ చైర్మన్ శోభ, మెంబర్ సెక్రెటరీ లు సరిత, పుష్పలత, ఇతర మహిళా ఉద్యోగులు పాల్గొనారు.

తిరుపతి

చిత్తూరు నెల్లూరు అనంతపురం

విలేకరులు కావలెను

సంప్రదించండి : 9440352036

## పచ్చదనంతో పర్యావరణం కాపాడుదాం.....







చాగణం ట్రస్టీ గౌరీ శంకర్.

పెళ్లకూరు స్వర్ణసాగరం మార్చ్ 21.

ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పెంచుకోవాలని తద్వారా పచ్చదనం పెరిగి పర్యావరణం కాపాడుకోగలుగుతామని చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ చాగణం గౌరీ శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని చాగణం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఊరూరా మొక్కల పెంపకం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రజలకు అడవుల ప్రాముఖ్యత మరియు పేదరిక నిర్మూలన, పర్యావరణ స్థిరత్వం మరియు ఆహార భద్రతలో వాటి కీలక పాత్ర గురించి అవగాహన పెంపొందించారు. ప్రతి సంవత్సరం మార్చి 21న అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా అడవుల విశిష్టత అందరికీ తెలుస్తుందన్నారు. ఈ క్రమంలోనే గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లకు ఇరువైపులా మొక్కలను నాటి సంరక్షిస్తున్నట్లు తెలిపారు. ట్రస్ట్ సీఈవో సీతారామయ్య మాట్లాడుతూ మానవ మనుగడ పర్యావరణం సమతౌల్యం పై ఆధారపడి ఉంటుందన్నారు. అందువల్ల ట్రస్ట్ తరఫున అనేక గ్రామాల్లో వేల కొలది మామిడి మొక్కలు పంపిణీ చేసి చాగోణం ట్రస్ట్ సేవల విశిష్టతను చాటుతున్నట్లు వివరించారు.

## జలదానం చేసిన భగీరథుడు (జడ్పీ చైర్మన్)



వి కోట స్వర్ణ సాగరం మార్చి 21:-

చిత్తూరు జిల్లావి.కోట మండలం, ముదరందొడ్డి పంచాయతీ, నడిపేపల్లిలో గత కొంతకాలంగా తాగునీటి సమస్య నందు వలన ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు దృష్టికి తీసుకురావడం జరిగింది. చైర్మన్ వెంటనే స్పందించి జడ్పి నిధుల ద్వారా నూతనంగా మంజూరు చేయించి బోరుడ్రిల్లింగ్ చేయించారు త్రాగునీటి బోరులో సుమారు 2.5 అంగుళాలు నీరు వెలువడింది.ఈ సందర్భంగా గ్రామస్థులు ఎంతో సంతోషం హర్షం వ్యక్తం చేశారు.బోరు బావి డ్రిల్లింగ్ ను జడ్పి చైర్మన్ జి.శ్రీనివాసులు(వాసు) స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఉదయం భూమి పూజ చేసి ప్రారంభించగా, వారి తనయుడు అమర్నాథ్ శ్రీనివాసులు మధ్యాహ్నం పరిశీలించారు.కార్యక్రమంలో వైస్ ఎంపిపి లక్ష్మణ్ రెడ్డి, వైస్ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, కన్వీనర్ రాధాకృష్ణారెడ్డి, ఎంపిటిసిలు అతావుల్లా, హరీష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఆలయ ఈవో పెంచల కిషోర్

కాణిపాకం, మార్చ్ 21 స్వర్ణ సాగరం



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఆలయ ఈవో పెంచల కిషోర్. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం నందు కార్యనిర్వహణధికారి పెంచల కిషోర్ , శుక్రవారం పలు కౌంటర్లలో ఆకస్మిత తనిఖీలు నిర్వహించి కౌంటర్లలో పనిచేయు సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తేవాలని సూచించారు, తరువాత డొనేషన్ కౌంటర్ నందు కూడా పరిశీలించడం జరిగింది, అన్నదానం భవనం నందు భోజనం రుచిని అడిగి భక్తులతో మాట్లాడి తెలుసుకున్నారు, భక్తులకు అన్నం వడ్డించి జరిగింది, ఈ కార్యక్రమంలో ఏఈవోలు ఎస్వి కృష్ణారెడ్డి, హరిమాధవ్ రెడ్డి, సిఎఫ్ఓ నాగేశ్వరరావు, సూపర్డెంట్ వాసు, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక
RNI No : APTEL/2020/15985



# 151.98 కిలోమీటర్లు సిసి రోడ్లు పూర్తి చేశాం:జిల్లా కలెక్టర్

చిత్తూరు, స్వర్ణసాగరం,మార్చి 21

జల సంరక్షణ చర్యల్లో భాగంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పెద్ద ఎత్తున పంట నీటి కుంటల నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కే పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పల్లె పండుగ, ఫారం ఫాండ్స్ నిర్మాణం, ఉపాధి హామీ పథకం అమలుపై సమీక్షించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ కు చిత్తూరు జిల్లా నుండి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వర్చువల్ విధానంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు రానున్న కాలంలో నీటి ఎద్దడిని నివారించేందుకు పంట నీటి కుంటల నిర్మాణం ఎంతగానో తోడ్పడు తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.5 లక్షల పంట నీటి కుంటలను జూన్ నెలాఖరు లోగా నిర్మించేందుకు జిల్లాల వారీగా ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. వేసవిలో ఉపాధి కూలీలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన తాగునీటి సౌకర్యం ఏర్పాట్లను చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంజూరైన సిసి రోడ్లు,గోకులం షెడ్ల నిర్మాణం పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు .జిల్లా లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా 207.5 8 కిలోమీటర్లు సిసి రోడ్లు మంజూరు కాగా ఇప్పటివరకు 151.98 కిలోమీటర్ల సిసి రోడ్లు పూర్తి చేశామని, ఫారం ఫాన్స్ లక్ష్యం 12,984 కాగా 17,009 మంజూరు చేయడం జరిగిందని, ఇందులో 2938 గ్రౌండింగ్ చేయగా 1283 పూర్తి చేయడం



జరిగిందని జిల్లా కలెక్టర్ వివరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ కు డ్వామా పిడి రవికుమార్ హాజరయ్యారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం సుచి సంస్థ ధ్యేయం

స్వర్ణసాగరం, యాదమరి మార్చి 21

ఆరోగ్యమే మహాభాగ్యమని సుచి స్వచ్ఛంద సేవ సంస్థ అధినేతలు పాల్ విజయ్ కుమార్ గ్లోరీ విజయ్ కుమార్ అన్నారు శుక్రవారం జోడి చింతల సుచి స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపు కు వారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదమరి మండలం నందు గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోగ్యంగా జీవించాలని సుచి సంస్థ ఈ యొక్క మెడికల్ క్యాంపు లు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు ఈ మెడికల్ క్యాంపులో మండల ప్రజలు పాల్గొని ఆరోగ్యంగా జీవించాలన్నారు అదేవిధంగా డాక్టర్ కవినిల మాట్లాడుతూ పేదలకు సేవ చేయడం కోసమే నేను డాక్టర్ గా చదివాను అన్నారు అందరూ బాగుండాలి అందులో నేనుండాలి అని నా యొక్క గురి అన్నారు ఈ క్యాంపు నందు సిఎంసి డాక్టర్లచే రక్త పరీక్ష మూత్ర పరీక్ష షుగర్ బిపి టిబి గుండె ఎముకలు పలు రకాలైన జబ్బులకు చికిత్స చేయడం జరిగిందన్నారు ఈ మెడికల్ క్యాంప్ న కు సుమారు 110 మంది పాల్గొన్నారు వీరికి మందులు మాత్రలు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆరోగ్య విద్య టిబి వ్యాధికి సంబంధించిన డాక్టర్ యూనియ . క్రిస్ మేరి మోన్స్ . అంజలి బెన్ని. పే ర్సెస్ యోహాన్. ప్రీత .ఆలం జోసఫ్ .వింజం ధరణి కుమార్. శుచి సంస్థ సిబ్బందులు కన్సల్టెంట్ శ్యామ్సన్ ఆనంద్ కుమార్.




ధనలక్ష్మి .వరదరాజులు. జాకప్ .జాన్సన్. ఎంఎస్ మనీ .డి చిన్నయ్య .శశి కుమార్. గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# ఆషా సంస్థ జూలియన్ రాజు ఆధ్వర్యంలో విద్యా సామాగ్రి పంపిణీ





రేణిగుంట స్వర్ణ సాగరం మార్చి 21

రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీ అన్నస్వామి పల్లి జడ్పీ హైస్కూల్లో చదువుతున్న 60 విద్యార్థులకు ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు ఆధ్వర్యంలో శుక్రవారం విద్యా సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు సునీత గౌడ్ మాట్లాడుతూ ఆషా సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం విద్యార్థులకు విద్యా సామాగ్రిని అందిస్తున్నారని అన్నారు. ఎప్పుడు విద్యార్థులకు అవసరమైన ఏ సహాయం అడిగిన రాజు సార్ కాదనకుండా చేస్తున్నారని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తరఫున వారికి ధన్యవాదాలు తెలిపారు. జూలియన్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అనేక సదుపాయాలను కల్పిస్తావుందని అన్నారు. వారితోపాటు మా వంతు సహాయంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ప్రతి సంవత్సరం విద్యార్థులకు ఆషా ఆధ్వర్యంలో విద్యా సామాగ్రిని పంపిణీ చేస్తున్నామని, ఇక ముందు కూడా విద్యార్థులకు అవసరమైన ఏ సహాయం చేయడానికి అయినా మా వంతు సహాయం చేయడానికి ఆషా సంస్థ సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమారి, సుహాసిని, నాగమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

# బంగారుపాళ్యం మండలం గుండ్ల కట్ట మంచి గ్రామ పంచాయతీ పూర్వపు పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్..

## ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్.

చిత్తూరు,స్వర్ణసాగరం,మార్చి 21:



బంగారుపాళ్యం మండలం, గుండ్ల కట్ట మంచి గ్రామ పంచాయతీ పూర్వపు పంచాయతీ కార్యదర్శి,జె.జి.ఉమాపతి ని సస్పెన్షన్ చేస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు .బంగారుపాళ్యం మండలం గుండ్ల కట్ట మంచి గ్రామ పంచాయతీ పూర్వపు పంచాయతి కార్యదర్శి, ప్రస్తుతము బంగారుపాళ్యం మండలము సంక్రాంతిపల్లి గ్రామ పంచాయతీ, వారు గ్రామ పంచాయతీ నిధులు రూ.3,68,441/-లు దుర్వినియోగము చేసినందులకు గాను వారిని పదవి నుండి తాత్కాలికముగా తొలగిస్తూ (సస్పెన్షన్) జిల్లా కలెక్టర్, చిత్తూరు వారు ఉత్తర్వులు జారీ చేసారు. మరియు సదరు మొత్తము రూ.3,68,441/-లు వారి నుండి రెవెన్యూ రికవరీ చట్టము మేరకు రికవరీ చేయుటకు తహసిల్దార్ బంగారుపాళ్యం వారిని జిల్లా కలెక్టర్ వారు ఆదేశించారు.

# ఎస్ సి బాలుర హాస్టల్ మరియు ఎస్ సి బాలుర హాస్టల్ తనిఖీ

బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.మార్చి 21





చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ ఎస్ సీ బాలుర హాస్టల్ ను మరియు ఎస్ సీ బాలికల హాస్టల్ ను చిత్తూరు జిల్లా ఎస్ సి ఎస్ టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ శేషాద్రి గ్రేడ్స్ సంస్థ అధ్యక్షులు బంగారుపాళ్యం ఆకస్మికంగా తనిఖీ చేసారు. హాస్టల్ వార్డెన్ పీ వినాయకం మాట్లాడుతూ 44 మంది విద్యార్థులు హాస్టల్ నందు వున్నారని తెలియచేయశారు,హాస్టల్ కు కాంపౌండ్ కావాలన్నారు, విజిలెన్స్ కమిటీ మెంబెర్ డాక్టర్ శేషాద్రి విద్యార్థులు తో మాట్లాడుతూ విద్యార్థులకు కావలసిన వసతులు అన్ని ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. విద్యార్థులకు జనరల్ నాలెడ్జి పై అవగాహన కల్పించారు. ఆలాగే ఎస్ సీ బాలికల హాస్టల్ ను తనిక చేయగా హాస్టల్ లో విద్యార్థినులతో శేషాద్రి గుడ్ టచ్ బాడ్ టచ్ గురించి విద్యార్థిను లకు అవగాహన కల్పిస్తూ విద్యార్థినుల సామాత్యాన్ని గుర్తించడం జరిగింది,చాలా చక్కగా పాఠశాల ఆవరణలో చదువులు చదువుతున్నారని,విజిలెన్స్ కమిటీ మెంబెర్ శేషాద్రి విద్యార్థులతో సమావేసమై వారి యొక్క సమస్యలు గురించి అడిగి తెలుసుకొన్నారు.వసతి గృహంలో 60 మంది విద్యార్థునులతో సమావేసం ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో 7 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు వ్రాస్తున్నారని. ముఖ్యంగా తనికీ లో వసతి గృహంలో బిల్డింగ్ రిపేర్లుకు నిధులు మంజూరు అయినాయని హాస్టల్ వార్డెన్ జీ గీత తెలియచేయశారు ఈ విషయాలను జిల్లా కలెక్టర్ గారి దృష్టికి తీసుకొని వెళ్తానని శేషాద్రి వార్డెన్స్ కు తెలియచేయశారు

# ఘనంగా అంతర్జాతీయ అటవీ దినోత్సవం




## అడవులు - ఆహారం

కనిగిరి స్వర్ణ సాగరం మార్చి 21

అడవులు ఆహార భద్రతకు చాలా ముఖ్యమని కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్, న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. అంతర్జాతీయ అటవీ దినోత్సవంను పురస్కరించుకొని శుక్రవారం సమగ్ర శిక్ష, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కనిగిరి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు “అడవులు – ఆహారము” అనే అంశం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అడవులు పండ్లు,గింజలు,వేర్లు,అడవి మాంసం, శిలీంధ్రాలు, కీటకాలు మరియు ఇతర తినదగిన మొక్కలను అందిస్తాయని ఇవి ఆహార భద్రతకు మరియు పోషకాలను అందించడానికి సహాయపడతాయని అన్నారు.అడవులు ప్రజల జీవనోపాధికి సహాయపడతాయని అడవులు ఆహారం, ఇంధనం, మందులు మరియు ఇతర వనరులను అందిస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద బాధితగిరిజన కుటుంబానికిసహాయ సహకారాలు



నెల్లూరు స్వర్ణ సాగరం మార్చి 21

నగరంలోని దీన దయాళ్ నగర్ గిరిజన కాలనీలో ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ప్రమాదంలో మాణికల సంజీవ మ్మ అనే గిరిజన మహిళ ఇల్లు పూర్తిగా దగ్ధమై ఇంటిలోని సామగ్రి సీలింగ్ ఫ్యాన్, ఫ్రిడ్జ్ గుడ్డలు,మంచాలు ,వంట పాత్రలు పూర్తిగా పాడైపోయిన విషయం తెలుసుకొని మాజీ కార్పొరేటర్ మామిడాల మధు,రెవెన్యూ అధికారులు అగ్నిమాపక సిబ్బంది గిరిజన మహిళను పరామర్శించి ప్రభుత్వ సహాయం అందించే చర్యలు తీసుకుంటామని చెప్పారు.అదేవిధంగా జయ భారత్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ గురు ప్రసాద్ రెడ్ క్రాస్ వారికి తెలియజేయగా ,,రెడ్ క్రాస్ యాజమాన్యం వంట పాత్రలు,వంట సరుకులు, టార్పాలిన్,అందించి సహాయం అందించారు.ఈ కార్యక్రమములో పాల్గొన్న పొట్లూరి శ్రీనివాసులు, ఛాచ్చుల ప్రసాద్ రెడ్ క్రాస్ యాజమాన్యానికి ధన్యవాదములు కృతజ్ఞతలు తెలియ జేసినారు.పొట్లూరి శ్రీనివాసులు ,అధ్యక్షులు పద్మభూషణ్ శ్రీ వెన్నెలకంటి రాఘవయ్య మెమోరియల్ ఆంధ్ర రాష్ట్ర గిరిజన సేవా సంగం,నెల్లూరు

# శ్రీసిటీలో ‘ఓజెఐ ఇండియా’ ప్యాకేజింగ్ పరిశ్రమ ప్రారంభం





శ్రీసిటీ,స్వర్ణ సాగరం మార్చి 21, 2025:

అట్ట పెట్టెలు, ఇతర ప్యాకేజింగ్ వస్తువుల తయారీలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఓజెఐ గ్రూప్ అనుబంధ సంస్థ ఓజెఐ ఇండియా ప్యాకేజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ నూతన పరిశ్రమకు శుక్రవారం శ్రీసిటీలో ప్రారంభోత్సవం జరిగింది. కంపెనీ కస్టమర్లు, సరఫరాదారులు, ఇతర ప్రతినిధుల సమక్షంలో చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ మునియో తకాహషి, ఓజీ హోల్డింగ్స్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ %డ% గ్రూప్ సీఈఓ హిరోయుకి ఇసోనో, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఓజీ ఇండియా ప్యాకేజింగ్ సీఈఓ యోషియుకి కురహషి లాంఛనంగా రిబ్బన్ కత్తరించి కంపెనీని ప్రారంభించారు. దేశంలో ఇది 5వ ప్లాంట్ కాగా, దక్షిణ భారతదేశంలో అతి పెద్దది. ఈ సందర్భంగా హిరోయుకి ఇసోనో మాట్లాడుతూ, ఓజెఐ సంస్థ ప్రపంచ వ్యాప్త వృద్ధి ప్రణాళికలో భారతదేశం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. సుస్థిరత, ఆవిష్కరణల ద్వారా నిర్మించిన ఈ శ్రీసిటీ ప్లాంట్, దక్షిణ భారతదేశ ప్యాకేజింగ్ అవసరాలకు అనుగుణంగా పనిచేస్తుందన్నారు. ప్లాంట్ నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయడంలో శ్రీసిటీ సహకారాన్ని ఆయన అభినందించారు. యోషియుకి కురహషి మాట్లాడుతూ భారత్ లో ఓజీ ప్రయాణాన్ని, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. Oji గ్రూప్ విస్తరణ జపాన్-భారత్ సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని మునియో తకాహషి వ్యాఖ్యానించారు. ప్రాంతీయ వృద్ధిని ప్రోత్సహిస్తూ ప్యాకేజింగ్ రంగంలో తనదైన ముద్ర వేస్తున్న కంపెనీ సామర్థ్యాన్ని ప్రశంసించారు. భారతదేశంలో రెండవ అతిపెద్ద జపనీస్ టౌన్‌షిప్ హోదాతో పాటు భారత్-జపాన్ వ్యాపార సంబంధాల మెరుగుకు కృషి చేస్తోందని శ్రీసిటీని కొనియాడారు. భారత ప్రధాని వ్యాఖ్యలను ఉటంకిస్తూ, ఆంధ్రప్రదేశ్‌ను ప్రముఖ తయారీ హబ్‌గా మార్చడంలో శ్రీసిటీ కీలకంగా మారిందని పేర్కొన్నారు.ఓజెఐ ఇండియా బృందాన్ని డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు. ఓజెఐ ప్లాంట్ ఏర్పాటు శ్రీసిటీలో అభివృద్ధి చెందిన బలమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను ప్రతిబింబిస్తుందని చెప్పారు. నూతన పరిశ్రమతో ఇక్కడ సరఫరా గొలుసు సామర్థ్యం మెరుగుపడుతుందని, ఇతర పరిశ్రమల ప్యాకేజింగ్ అవసరాలు తీరుతాయన్నారు. శ్రీసిటీ పారిశ్రామిక కుటుంబంలో మరో ప్రముఖ సంస్థ చేరడం పట్ల గర్విస్తున్నాము అన్నారు. శ్రీసిటీలో 43 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటైన అత్యాధునిక ఓజీ ఇండియా ప్లాంట్, 100 మిలియన్ల వార్షిక సామర్థ్యంతో అట్ట పెట్టెలు, ఇతర ఉపకరణాలు తయారు చేస్తుంది. దక్షిణ భారతదేశ డిమాండ్ మేరకు ఉత్పత్తులు అందిస్తుంది.



# ఎస్సీ హాస్టల్ ను కనిగిరిలో కొనసాగించాలి




కనిగిరి స్వర్ణ సాగరం మార్చి 21

ఎస్సీ హాస్టల్ ను కనిగిరిలోనే కొనసాగించాలని దళిత ప్రజా సంఘాలు కనిగిరిలోని ఏఎస్డబ్ల్యూఓ శివ నాయక్ కి శుక్రవారం వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి(%ఐనూరా%) ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్, మాలల ఐక్యవేదిక నాయకులు శాంతరాజు, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్ దమ్ము కేశవులు, కటికల అగస్టీన్, గుడిపాటి పల్లి ఎంపీటీసీ నాగేశ్వరరావు, పలుకూరి భాస్కర్, వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోటికల బాలబాదుర్ల, కోటపాటి రమణ కనిగిరి ఎల్పిపి ఇన్చార్జ్ దమ్ము వెంకటేష్, వేము వెంకయ్య, కల్లు వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# చెత్త సంపద ట్రైనింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ఉగ్ర



కనిగిరి స్వర్ణ సాగరం మార్చి 21

కనిగిరి నియోజకవర్గం పామూరులో చెత్త సంపద కేంద్రంలో ట్రైనింగ్ కేంద్రాన్ని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి సందర్శించి చెత్త సంపద కేంద్రంను పరిశీలించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో బోల్తా ఘోర రోడ్డు ప్రమాదయ-ఒకరు మృతి

కనిగిరి స్వర్ణసాగరం మార్చి 21



కనిగిరి పట్టణంలోని కాశిరెడ్డి కాలనీ చెందిన ఇండ్ల లక్ష్మమ్మ(50) భర్త మునయ్య కూలి పనుల నిమిత్తం వెళ్తుండగా పెద్ద చెర్లోపల్లి మండలం తలకొండపాడు సమీపంలోని విజయగోపాల పురం వద్దకు ఆటోలో వెళ్తుండగా మలుపు వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.ఆటో ఒక్క సారిగా అదుపు తప్పి బోల్తా కొట్టడంతో కూలి పనులకు వెళ్తున్న లక్ష్మమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఇద్దరికీ బలమైన గాయాలు కాగా కనిగిరి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించదవడం జరిగింది.

# కనిగిరి ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు



మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి స్వర్ణ సాగరం మార్చి 21

కనిగిరి పట్టణంలో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ తెలిపారు. పట్టణంలోని 9వ వార్డులో విద్యుత్ లో ఓల్టేజి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, నూతన ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు కోసం శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులతో కలిసి మున్సిపల్ చైర్మన్ సుదర్శన్ థియేటర్ వెనుక వైపు స్థలాన్ని ఎంపిక చేశారు. విద్యుత్ లో వోల్టేజి సమస్యలు ఏర్పడకుండా ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సహకారంతో నూతన ట్రాన్స్ఫార్మర్లు అమరుస్తున్నట్లు చైర్మన్ తెలిపారు.పట్టణంలోని 20 వార్డుల్లో ప్రజలు లో వోల్టేజి సమస్యతో ఇబ్బందులు పడకుండా, నాణ్యమైన విద్యుత్ సరఫరా కొనసాగించేందుకు విద్యుత్ శాఖ అధికారులతో కలిసి చర్యలు చేపట్టామన్నారు. ఎక్కడ లో వోల్టేజి సమస్య ఉన్నా ఆ ప్రాంతాల్లో అదనపు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చొప్పరపు మాధవి ( శివ)ఎలక్ట్రికల్ ఏఈ పవన్ కుమార్. టౌన్ లైన్ మాన్ వెంకటయ్య. జిలాని భాష వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# డిపాజిటర్లకు ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన

వల్లేటి వారి పాలెం స్వర్ణ సాగరం మార్చి 21







మండల కేంద్రంలో శుక్రవారం భారతీయ రిజర్వ్ బ్యాంక్ అవార్డు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో డిపాజిటర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. డి ఈ ఏఎఫ్ ఆర్థిక సహాయంతో బ్యాంకు సేవలు గురించి ముఖ్య అతిథులు ఎంపీడీవో కే నరేంద్ర దేవ్ ఎంఈఓ ఏ మల్లికార్జున ఏపీజీబీ విశ్రాంత మేనేజర్ సూర్య ప్రకాష్ అవార్డు సంస్థ అడ్మిన్ రాజేశ్వరితమ తమ సందేశాలలో బ్యాంకుల కార్యకలాపాలు నామినేషన్ ప్రాధాన్యతబ్యాంకుల ద్వారా అమలవుతున్న పథకాలు సైబర్ నేరాలు అరికట్టేందుకు తీసుకోవలసిన చర్యలు తదితర విషయాలను వివరించారు. బాల్యం నుంచి పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని ఈ విషయాన్ని తల్లిదండ్రులకు స్నేహితులకు తెలియజేయాలన్నారుబ్యాంకు రుణాలు సక్రమంగా చెల్లించి సిబిల్ స్కోర్ పెంచుకోవాలన్నారు ఖాతాదారులు సామాజిక భద్రతా పథకాలలో చేరాలని అడ్మిన్ రాజేశ్వరి పేర్కొన్నారు. కళాకారులు ఆలపించిన చైతన్య గీతాలు సభికుల నాకట్టుకున్నాయి

ఈ కార్యక్రమంలో అవార్డు ప్రతినిధులు శ్రీనివాసరావు బాజీ ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది రైతులు విద్యార్థులు పాల్గొన్నారు

# సీఎం బాబు , మంత్రి లోకేష్ ను కలిసిన ఎమ్మెల్యే ఆదిమూలం





సత్యవేడు స్వర్ణ సాగరం మార్చి 21

ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు , మంత్రి శ్రీ నారా లోకేష్ ను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మర్యాద పూర్వకంగా కలిశారు.ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు మనవడు నారా దేవాన్ష్ జన్మదినాన్ని పురస్కరించుకొని సీఎం శుక్రవారం కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరుగు పయనంలో భాగంగా రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు.అప్పటికే విమానాశ్రయంలో వేచి ఉన్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ని, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ ను కలుసుకొని అభివాదం చేస్తూ ఘనంగా వీడ్కోలు పలికారు.

# సూళ్లూరుపేట సెబ్ పరిధిలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు...

దొరవారిసత్రం మద్యం షాపులు ముందే మద్యం సేవిస్తున్న మద్యం ప్రియులు...

ప్లాస్టిక్ ను నిషేధించినా బ్రాందీ షాపుల ముందే ప్లాస్టిక్ గ్లాసులను అమ్ముతున్న వైనం...

తెల్లవారి నుంచి అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలు...

విచ్చలవిడిగా బెల్ట్ దందాలు కొనసాగుతున్న పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు...

నెలవారీగా మామూల మత్తులో అధికారులు..????

స్వర్ణసాగరం, దొరవారిసత్రం, మార్చ్ 21...

తిరుపతి జిల్లా సూళ్లూరుపేట సెబ్ పరిధిలోని మండలాలలో బెల్ట్ షాపులు ఉదయం 5 గంటల నుండి మొదలై రాత్రి ఒంటిగంట వరకు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ అనుమతితో నడిచే వైన్ షాపులు నిర్ణీతసమయంలో కొనసాగినా, ఇక్కడ బెల్ట్ షాపులు మాత్రం రాత్రి పగలు తేడా లేకుండా 24 గంటలు మద్యం అమ్మకాలు జరుగుతుండడం గమనార్హం.బెల్ట్ షాపుల్లో ఏ అర్ధ రాత్రి తలుపు తట్టినా మద్యం లభిస్తుంది. అంతేకాకుండా ఇక్కడ డోర్ డెలివరీ సదుపాయాలను కూడా బెల్ట్ షాపుల నిర్వాహకులు చేపడుతున్నారు.సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం,మండలాలలో కొంతమంది పేరుకు కిరాణా దుకాణాలు నిర్వహిస్తూ లోపల మాత్రం మద్యం వ్యాపారం చేస్తున్నారు. మద్యం ప్రియుల బలహీనతలను అసరా చేసుకుని అధిక ధరలకు మద్యం విక్రయించడం జరుగుతోంది.మద్యం మత్తులో ఇళ్ల మధ్యలో గొడవలు పడుతూ అర్ధరాత్రి వరకు నానా రభస చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు, కానీ ఎవరూ పట్టించుకోవడంలేదని గ్రామాల్లో మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విచ్చలవిడిగా మూడు మండలాల్లో మద్యం దొరుకుతున్న మద్యం కారణంగా పచ్చని సంసారాల్లో చిచ్చు పెడుతుందని, బెల్ట్ షాపులు నిర్వహిస్తుండడంతో యువత పెడదారి పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



**అధికారుల కనుసన్నల్లోనే బెల్ట్ షాపులు..????**

మూడు మండలాల గ్రామాల్లో అధికారుల అండదండలతో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు అనధికారిక మద్యం విక్రయాలపై అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది అని పల్లెలోని ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





# ఇచ్చిన హామీ నెరవేర్చే నాయకుడు లోకేష్ బాబు

## మీసేవ కేంద్రాలకు పూర్వ వైభవం తీసుకొస్తాం అని అసెంబ్లీలో ప్రస్తావించిన మంత్రి లోకేష్

## హర్షం వ్యక్తం చేస్తున్న మీసేవ నిర్వాహకులు ఆపరేటర్లు



కోట స్వర్ణసాగరం మార్చి 21

ఇచ్చిన హామీ తప్పకుండా నెరవేర్చే నాయకుడు తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీశాఖ మంత్రి వర్యులు లోకేష్ బాబు అని మీసేవ నిర్వాహకులు మట్టిగుంట.సురేంద్ర బాబు అన్నారు.కోటలో పత్రికా ముఖంగా మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో మీసేవ కేంద్రాల నిర్వాహకులకు ఇచ్చిన హామీ మేరకు మీసేవ నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించడం పూర్వ వైభవం తీసుకొస్తామని ఐటీ శాఖ మంత్రి లోకేష్ బాబు అసెంబ్లీలో ప్రస్తావించిన సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ 20 ఏళ్లుగా రాష్ట్ర ప్రజలకు త్వరిత గతిన ప్రజలకు పలు రకాల సేవలు అందిస్తున్న మీసేవ కేంద్రాలను గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు.హైకోర్టు ఆదేశాలు సైతం లెక్కచేయకుండా ప్రత్యక్షంగా పరోక్షంగా 20 వేల మంది నిరుద్యోగుల ఉపాధిని వైసీపీ ప్రభుత్వం రోడ్డున పడేసిందని అన్నారు.లోకేష్ బాబు యువగళం పాదయాత్ర జరుగుతున్న సమయంలో మీసేవ నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి మీసేవ కేంద్రాలకు పూర్వవైభవం తీసుకొస్తామని ఇచ్చిన హామీని అసెంబ్లీలో ప్రస్తావిస్తూ నిరుద్యోగులను గుర్తించడం శుభపరిణామం అని అన్నారు.కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర అభివృద్ధితో పాటు అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# సునీత విలియమ్స్ రాక విజ్ఞాన శాస్త్రం సాధించిన ఒక అద్భుత విజయం

## డా. శ్యాం ప్రసాద్ శశాంక్,ప్రముఖ ఆర్తోపెడిక్ వైద్యులు.

నెల్లూరు స్వర్ణ సాగరం మార్చి 21



అంతరిక్షంలో చిక్కుకుపోయిన భారత సంతతికి చెందిన శాస్త్రవేత్త సునీత విలియమ్స్ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి సురక్షితంగా భూమికి తీసుకువచ్చిన నాసా, స్పేస్ ఎక్స్ బృందాల కృషి అభినంద నీయమని, విజ్ఞాన శాస్త్రం సాధించిన ఒక అద్భుత విజయమని కొనియాడారు. ఆమెను స్ఫూర్తిగా, ఆదర్శంగా తీసుకొని ఆమె అడుగుజాడల్లో పయనించాలని కీళ్ళ, ఎముకలు, నరముల వ్యాధి వైద్యనిపుణులు డాక్టర్ శ్యాం ప్రసాద్ శశాంక్ అన్నారు. శుక్రవారం, డైకస్ రోడ్ సెంటర్ లోని వియాని హెూం నందు కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పిఎంపి అసోసియేషన్) నిర్వహించిన సునీత విలియమ్స్ అభినంద సభలో ఆయన మాట్లాడుతూ ఎనిమిది రోజుల పర్యటన నిమిత్తం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లి అనుకోని పరిస్థితుల్లో తొమ్మిది నెలలు రోదసిలో ఉండడం, ఇలాంటి కష్టపరిస్థితులలో మానసిక ధైర్యాన్ని కోల్పోకపోవడం సునీత విలియమ్స్ గొప్పతనం అని ఆయన ప్రశంసించారు. కల్పనా చావ్లా, యూరిగగరిన్, సునీత విలియమ్స్ లాంటి ఎందరో అంతరిక్ష శాస్త్రవేత్తలు సమాజం కోసం తమ జీవితాల్ని పణంగా పెట్టారని ఆయన అభినందనలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పి.హెచ్.పి గౌరవాధ్యక్షులు జయప్రకాష్, వియాని హెూమ్ సిస్టర్స్ రమ, జయ, జిల్లా పీ.హెచ్.పి నాయకులు షేక్ సత్తార్, శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, ఎస్.రాము, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలు అమలు చేయకుండా,ప్రజా సమస్యలు పక్కన పెట్టి వింత కార్యక్రమాలు నిర్వహించడం సిగ్గు చేటు

## వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి స్వర్ణ సాగరం మార్చి 21



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వింతగా కార్యక్రమాలు నిర్వహించడం సిగ్గుచేటు అని కనిగిరి వైసీపీ ఇన్చార్జి దద్దాల నారాయణ విమర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా,ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ప్రజా స్వామ్యన్ని ఖూనీ చేస్తుందన్నారు. ఇలాంటి వింత కార్యక్రమాల వలన ప్రజా ధనం దుర్వినియోగం అవ్వటం తప్పా ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేదని,ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా,నిరుద్యోగ భృతి నెలకు మూడు వేలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేశారని అన్నారు.ఉచిత బస్ కింద మహిళలు రాష్ట్రంలో ఏ జిల్లాకు అయిన వెళ్ళచ్చు అని చెప్పి ఆ పథకాన్ని బడ్జెట్ లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు.ఆడబిడ్డ నిధి కింద ప్రతి మహిళకు నెలకు 1500 రూపాయలు అని చెప్పి బడ్జెట్ లో రూపాయి కూడా కేటాయించలేదు. రైతులు గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్న పరిస్థితి ఉంటే కూటమి ప్రభుత్వం రైతు సమస్యలను పట్టించుకోకుండా వింత కార్యక్రమాలు నిర్వహించడంఏంటి అని ప్రశ్నించారు. 2019 ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇలాంటి కార్యక్రమాలు ఎప్పుడు నిర్వహించలేదని అన్నారు.2019 ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి చూపించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని దద్దాల నారాయణ కొనియాడారు.

# చెరువు కట్టనూ వదలని కబ్జాదారులు



స్వర్ణ సాగరం- శ్రీకాళహస్తి

:మండలంలోని లింగమ నాయుడు పల్లి చెరువు కట్ట కబ్జాకు గురైంది. లింగమనాయుడు పల్లి కట్ట చెరువు జాతీయ రహదారి కి ఆనుకుని ఉంది. ఆ కట్టను గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకుని షెడ్డులు వేసి బాడుగలు తీసుకుంటున్నాడు. గతంలో ఆక్రమించిన వారు ఈ కట్ట స్థలాన్ని నేనే ఆక్రమించుకున్నామని ఇది వర్గాల మధ్య దర్శనం జరిగింది. ఈ స్థలం విషయంలో ఘర్షణ పడడంతో తొట్టంబేడు పోలీస్ స్టేషన్ కి మధ్యస్థం చేరింది ఇద్దరు ఆకట్ట ను ఖాలి చేయాలని చెప్పి పంపారు.అయితే యధా ప్రకారం కట్ట స్థలంలో పంచర్ షాప్ ను కొనసాగిస్తున్నాడు. మళ్ళీ ఈ స్థలాన్ని గతంలో ఆక్రమించుకున్న వ్యక్తి వెళ్లి నా స్థలాన్ని నాకు వదిలేయమనగా అడగగా వారి ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కొత్తగా కట్టపై షెడ్డు వేసిన వ్యక్తి గ్రామాన్ని ఎదిరించి యధా ప్రకారం ఆ పంచర్ దుకాణం ను నడుపుతున్నాడు. కట్ట స్థలంపై గ్రామంలో నిత్యం ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ ఘర్షణలతో ఆ గ్రామంలో ఏ క్షణం ఏం జరుగుతుందోనని ప్రజలు బయపడుతున్నారు. రెండు నెలలుగా ఇంత జరుగుతున్న అధికారులు మాత్రం చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆ గ్రామ ప్రజలు అధికారులపై విరుచుపడుతూన్నారు.ఆ కట్ట స్థలంపై ఆ గ్రామంలో పదేపదే గొడవ జరుగుతున్నా మాకేం పట్టనట్టు అధికారులు చోద్యం చూస్తూ ఉన్నారని ఆ గ్రామ ప్రజలు రెవిన్యూ అధికారులపై ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి కట్ట స్థలాన్ని ఖాలీ చేయాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# కె ఎస్ ఎన్ హై స్కూల్ టెన్త్ క్లాస్ విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

**జనసేన పార్టీ వితరణ**

**ముత్తుకూరు స్వర్ణ సాగరం మార్చి 21**

లిసర్వేపల్లిలోని K.S.N. Z.P హైస్కూల్‌లిటెన్త్ క్లాస్ విద్యార్థులకుసర్వేపల్లి నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు సర్వేపల్లి నియోజకవర్గం లోని సర్వేపల్లి గ్రామపంచాయతీ పరిధి నందు కురువాడ సత్యనారాయణ ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల లో పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థిని విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేయడం జరిగిందిలిజనసేన పార్టీ యువతకు అండగా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ సమస్యలను పరిష్కరిస్తూ ప్రజాసేవలో నిరంతరం ఒక అడుగు ముందు ఉంటుంది.సర్వేపల్లి కురవాడ సత్యనారాయణ ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మాలాంటి పేదలు చదువుకోవడం కోసం ఏడు కిలోమీటర్లు వెళ్లి నిడిగుంటపాలెంలో చదువుకునేటువంటి ఆనాటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఆ మహానుభావుడు మన ఊర్లోనే స్కూలు ఉండాలా పిల్లలు అంత దూరం నడిచిపోకూడదు అనేటువంటి ఆలోచనతో ఆయన సొంత నిధులతో ఈ యొక్క బడిని నిర్మించడం జరిగింది ఆ మహానుభావుడు పుణ్యం వల్ల ఎంతోమంది మాలాంటి పేద మధ్యతరగతి విద్యార్థిని విద్యార్థులు ఇక్కడ చదువుకొని ఎంతో ఉన్నత స్థాయికి వెళ్తున్నారు దేశ విదేశాలలో కూడా ఉన్నారు మా నియోజకవర్గం ఒక గొప్ప మహానుభావుడి ఇంటి పేరు కావడం ఆయన పూర్వీకులు ఇదే సర్వేపల్లిలో ఉండడం మా అదృష్టంగా భావిస్తూ సర్వేపల్లి నియోజకవర్గ ఖ్యాతిని నేటి విద్యార్థిని విద్యార్థులు ఉన్నత స్థాయిలో నిలబెడతారని మనస్ఫూర్తిగా కోరుకుంటూ నాము.ఈ కార్యక్రమంలో పినిశెట్టి మల్లికార్జున్, సందూరి శ్రీహరి, మణి ,ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు పరిధి నందు కురువాడ సత్యనారాయణ ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల లో పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థిని విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేయడం జరిగిందిలిలిజనసేన పార్టీ యువతకు అండగా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ సమస్యలను పరిష్కరిస్తూ ప్రజాసేవలో నిరంతరం ఒక అడుగు ముందు ఉంటుంది.సర్వేపల్లి కురవాడ సత్యనారాయణ ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మాలాంటి పేదలు చదువుకోవడం కోసం ఏడు కిలోమీటర్లు వెళ్లి నిడిగుంటపాలెంలో చదువుకునేటువంటి ఆనాటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఆ మహానుభావుడు మన ఊర్లోనే స్కూలు ఉండాలా పిల్లలు అంత దూరం



నడిచిపోకూడదు అనేటువంటి ఆలోచనతో ఆయన సొంత నిధులతో ఈ యొక్క బడిని నిర్మించడం జరిగింది ఆ మహానుభావుడు పుణ్యం వల్ల ఎంతోమంది మాలాంటి పేద మధ్యతరగతి విద్యార్థిని విద్యార్థులు ఇక్కడ చదువుకొని ఎంతో ఉన్నత స్థాయికి వెళ్తున్నారు దేశ విదేశాలలో కూడా ఉన్నారు మా నియోజకవర్గం ఒక గొప్ప మహానుభావుడి ఇంటి పేరు కావడం ఆయన పూర్వీకులు ఇదే సర్వేపల్లిలో ఉండడం మా అదృష్టంగా భావిస్తూ సర్వేపల్లి నియోజకవర్గ ఖ్యాతిని నేటి విద్యార్థిని విద్యార్థులు ఉన్నత స్థాయిలో నిలబెడతారని మనస్ఫూర్తిగా కోరుకుంటూ నాము.ఈ కార్యక్రమంలో పినిశెట్టి మల్లికార్జున్, సందూరి శ్రీహరి, మణి ,ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు

# మాలల సింహ గర్జన అనుమతి రద్దు సరికాదు

**కులగణన ప్రకారం సమన్యాయం చేయాలి**

**అసెంబ్లీలో గొంతు విప్పకపోతే ఎమ్మెల్యేల ఇళ్లు ముట్టడిస్తాం**

**మాలల జేపీసీ నాయకుల స్పష్టీకరణ**

**స్వర్ణ సాగరం బిశ్రీకాళహస్తి:**

రాయలసీమ మాలల సింహ గర్జన అనుమతి రద్దు చేయడం సరికాదని మాలల జేపీసీ నాయకులు అన్నారు. కులగణన ప్రకారం సమన్యాయం చేయకుండా రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. విభజన పేరుతో మాలలకు జరిగిన అన్యాయంపై అసెంబ్లీలో గొంతు విప్పకపోతే ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామని స్పష్టం చేశారు. శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో మాలల జేపీసీ, జై భీమ్ ఆర్మీ నాయకులు పులి శ్రీకాంత్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలన్నింటికీ సభలు నిర్వహించుకోవడానికి ఇస్తున్న అనుమతిని హక్కుల పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న మాలల సింహ గర్జనకు మాత్రం




ఎందుకు రద్దు చేశారని నిలదీశారు. విభజనకు సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలుగు రాష్ట్రాల్లోనే ఎందుకు హుటాహుటిన అమలు చేయడానికి కారణంపై ప్రశ్నించారు. విభజన అభ్యంతరాలను కేంద్రంలోని పలువురు మంత్రులు, ఎంపీలు కూడా లేవనెత్తిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణాలో ఎస్సీ వర్గీకరణలో సమన్యాయం పాటించారని తెలిపారు. అయితే ఆంధ్రరాష్ట్రంలో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించారని చెప్పారు. కులగణన చేసిన తర్వాతే వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన వాటాలు కల్పించాలన్నారు. హక్కులను హరించే క్రిమిలేయర్ ను వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. స్వాతంత్రం సిద్ధించి 76 సంవత్సరాలు అయినా మాలల పట్ల ఇప్పటికీ వివక్షత కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సింహ గర్జనకు తొలుత ఇచ్చిన మేరకు సభ నిర్వహణకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాలల విషయంలో సాగుతున్న రాష్ట్రంలోని ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా అసెంబ్లీలో ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా అసెంబ్లీలో తమ గొంతును వినిపించకపోతే ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాలల జేపీసీ నాయకులు అల్లం మణి, బీఎస్ఎన్ఎల్ నాగరాజు, చారులత, పోతుల చంద్ర, రాజేంద్ర, కస్తూరయ్య తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం తేవాలి





**దడాల సుబ్బారావు**

**స్వర్ణ సాగరం-శ్రీకాళహస్తి**

రాష్ట్రంలోని వ్యవసాయ కూలీల అభివృద్ధికి సమగ్ర చట్టం తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తిరుపతి జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్లో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన దడాల సుబ్బారావు మాట్లాడుతూ వ్యవసాయ కూలీలకు గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రోజువారి వేతనం రూ.300 కాకుండా రూ.600 చెల్లించాలని కోరారు. సాగు భూములు పంపిణీ చేయాలనీ, పట్టాలు ఇవ్వాలనీ, కూటమి ప్రభుత్వం ప్రకటించిన విధంగా మూడు సెంట్లు ఇంటి స్థలం కేటాయించి పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి రూ.5 ఐదు లక్షలివ్వాలని సూచించారు. గత ప్రభుత్వంలో ఫ్రీ హెూల్డ్ భూములలో జరిగిన అక్రమాలను బయటపెట్టి, అక్రమార్కులపై ల్యాండ్ గ్రాబింగ్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించాలని కోరారు.

**నూతన జిల్లా కమిటీ ఎన్నిక**

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తిరుపతి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దండాల సుబ్బారావు తెలిపారు. జిల్లా అధ్యక్షులుగా తలారి బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా దాసరి జనార్ధన్, ఉపాధ్యక్షులుగా కే గురవమ్మ, ఎన్ రమణయ్య, వందవాసి నాగరాజు, కార్యదర్శులుగా ముత్యాలయ్య, రాజగోపాల్, రామచంద్రారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా సుబ్బమ్మ, నారాయణ, శంకరయ్య, తిరుపాలు, సుబ్బయ్య, కత్తి గురవయ్య, బాల గురవయ్య, వెంకటయ్య, కృష్ణయ్య, రమణయ్య శ్రీనివాసులు, హరి, అముదా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సుబ్బారావు ప్రకటించారు.

# కళాశాలలను సమగ్రంగా తనిఖీ చేయాలి


**-డా.యం.ఉమేష్ రావు**

**స్వర్ణ సాగరం- శ్రీకాళహస్తి**



విద్యా ప్రమాణాలను గాలికొదిలేసి,ధనార్జనే ధ్యేయంగా చేసుకొని అక్రమాలకు పాల్పడుతున్న అన్ని రకాల కళాశాలలను సమగ్రంగా తనిఖీ చేయాలని తెలుగుదేశం పార్టీ, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ని కోరారు.వివిధ వృత్తి విద్యా కోర్సులకు అనుమతులు ఇచ్చే వివిధ సంస్థలు సంయుక్త తనిఖీ లపై దృష్టి పెట్టక పోవడం వలనే కళాశాలల యాజమాన్యాలు అక్రమాలకు పాల్పడటంలో బరితెగింపు ప్రదర్శిస్తున్నాయని ఆరోపించారు.పుత్తూరు పట్టణానికి చెందిన ఒక యాజమాన్యం ఒకే భవనాన్ని చూపించి, నిబంధనలకు విరుద్ధంగా వివిధ రకాలైన వృత్తి విద్యా కోర్సులకు అనుమతులు పొంది, తరగతులు నిర్వహించడాన్ని తీవ్రంగా పరిగణించి,ఇటువంటి అతిక్రమణలు ఇంకెవరూ చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని నారా లోకేష్ కి విజ్ఞప్తి చేశారు.కళాశాలల నాణ్యతా ప్రమాణాలను డేగ కళ్ళతో పరిశీలిస్తూ, ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సమాచారం అందించాల్సిన విశ్వవిద్యాలయాలు నిష్క్రియాత్మకంగా మారిపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.కళాశాలలో పనిచేస్తున్న బోధన మరియు బోధనేతర సిబ్బందికి ఉద్యోగ భద్రతను కల్పించడంలో కూడా తీవ్రమైన నిర్లక్ష్యం చేస్తూ, కనీసం ఇపిఎఫ్ రిజిస్ట్రేషన్ చేయకుండా ఉద్యోగుల జీవితాలకు భరోసా లేకుండా చేస్తున్న విషయంపై నారా లోకేష్ దృష్టి పెట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో వన్నియకుల క్షత్రియ సంక్షేమ మరియు అభివృద్ధి డైరెక్టర్ మిన్నల్ రవి, తెలుగుదేశం పార్టీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి, బిసి విభాగం శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మునిరాజా యాదవ్,నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్,బిసి విభాగం తిరుపతి పార్లమెంటు నాయకులు మణి,శివ తదితరులు పాల్గొన్నారు.

## పామూరు మండల మాజీ జడ్పీటిసి సభ్యులు మారుబోయిన హుస్సేన్ రావు యాదవ్ మృతదేహానికి నివాళులర్పించిన రాష్ట్ర సమాజ్ వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లు



**కనిగిరి స్వర్ణ సాగరం మార్చి 21.**

పామూరు మండల మాజీ జడ్పీటిసి మారుబోయిన హుస్సేన్ రావు యాదవ్ మృతదేహానికి శుక్రవారం రాష్ట్ర సమాజ్వాది పార్టీ అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లు దర్శించి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పాశం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మారుబోయిన హుస్సేన్ రావు యాదవ్ మంచి మిత్రుడని మంచి మనసున్న వ్యక్తిని కోల్పోయినందుకు విచారిస్తున్నానని వారి కుటుంబానికి నా యొక్క ప్రగాఢ సంతానం తెలియ చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో బిసి నాయకులు కేతనబోయిన పెద్దన్న తోకల తిరుపతిరావు మరియు టిడిపి నాయకులు శ్యామల చిన్న వెంకటేశ్వర్లు, బాలేబోయిన పిచ్చయ్య,గొల్లపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమణలు ను అడ్డుకుంటున్న ప్రెస్ క్లబ్ అధ్యక్షులు





**డాక్టర్ కోటేశ్వరరావు**

**స్వర్ణ సాగరం - శ్రీకాళహస్తి**

ప్రెస్ క్లబ్ అధ్యక్షులు యంగ్ అండ్ డైనమిక్ లీడర్ ఆధ్వర్యంలో కబ్జాలకు కళ్లెం. శ్రీకాళహస్తి పట్టణంలోని బంగారమ్మ గుడి సమీపంలో నాగాలమ్మ పుట్ట వెనకాల ఉన్న అప్పలయగుంట సర్వే నంబర్ లెక్క దాఖలలోని 54/16 కాలువ స్థలాన్ని కబ్జా చేశారని విషయం తెలుసుకున్న ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కోటేశ్వర బాబు కబ్జాలకు కళ్లెం వేసేందుకు సహచర పాత్రికేయులతో సంఘటన స్థలానికి చేరుకుని కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించి వెంటనే తండ్రికి తగ్గ తనయుడు యువకుడు ఉత్సాహవంతుడు శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి శ్రీకాళహస్తి తహసిల్దార్,సర్వేయర్ దృష్టికి తీసుకెళ్ళారు.స్పందించిన ఎంఎల్ఏ సుధీర్ రెడ్డి శ్రీకాళహస్తి నియోజకవర్గం లో ప్రభుత్వ భూములు కబ్జాలకు తావు లేకుండా పాలన కొనసాగిస్తామన్నారు. సంబధిత అధికారులకు కబ్జాకు గురైన కాలువ స్థలంలో హెచ్చరిక బోర్డ్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సంఘ సేవకులు పేదల పాలిట పెన్నిధి డాక్టర్ కోటేశ్వర బాబు మాట్లాడుతూ ఎంఎల్ఏ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పాలనలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కబ్జాదారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటూ కబ్జాలకు చోటు ఉండనీయమని ప్రెస్ క్లబ్ మిత్రుల సహకారంతో కబ్జాలను అడ్డుకుంటామని ఈ సందర్భంగా ఆయన అన్నారు. స్పందించిన శ్రీకాళహస్తి తాసిల్దార్.. సంఘటన స్థలానికి సర్వేర్ విఆర్ఓని పంపించి ఆ స్థలాన్ని పరిశీలించారు ఆక్రమణదారులపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.

# పక్కా గృహాలు నిర్మించాలి అని కోరుతూ మేఘల దేవికి వినతి పత్రం సమర్పిస్తున్న యానాదులు

**కొయ్యలగూడెం మర్చి 21 స్వర్ణ సాగరం**



తమకు ప్రత్యేకంగా నివాస స్థలాలను ఇప్పించి పక్కా గృహాలను ఏర్పాటు చేసి ఇవ్వాలని కోరుతూ కొయ్యలగూడెం యానాదుల సంఘం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ మహిళా కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్ల మేఘల దేవికి ఆమె నివాసంలో వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా మేఘ ల దేవి మాట్లాడుతూ సమస్యను పోలవరం శాసనసభ్యులు బాలరాజు మరియు ఏలూరు ఎంపీ మహేష్ యాదవుల దృష్టిలో పెట్టి త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న మూడు సెంట్లు నివేశ స్థలంలో వారి పేర్లు ఉండేలాగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని రాష్ట్రానికి దశా దిశా మార్చగలిగిన ఏకైక రథసారధి చంద్రబాబు నాయుడు అని గుర్తు చేశారు బడుగు బలహీన వర్గాలను గుర్తించి ఆదుకునేది ఒక్క తెలుగుదేశం పార్టీ అని ఆమె అన్నారు రానున్న రోజుల్లో నివేశ స్థలాలను మంజూరు చేపించి పక్కా గృహాలను కట్టించే బాధ్యత తాను తీసుకుంటానని వారికి హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు మరియు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# సిఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన కర్నాటియాదగిరి



**నల్లగొండ, స్వర్ణసాగరం,మార్చి 21:**

శుక్రవారం నల్లగొండ పట్టణ కేంద్రంలో కేంద్రంలో బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో బీసీ 42 శాతం రిజర్వేషన్ కల్పించిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసిన, బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షులు కర్ణాటక యాదగిరి, అనంతరం మహాత్మా జ్యోతి రావు బాపూలే విగ్రహానికి పూలమాల వేశారు, సందర్భంగా మాట్లాడుతూబీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కి తిరుమల రేవంత్ రెడ్డి,మరియుజిల్లా మంత్రి కోమటిటడ్డి వెంకట్ రెడ్డి,బిసి మంత్రులు అందరికీ బీసీ రాజ్యాధికార సమితి కమిటీ తరపున వారికి ప్రత్యేకధన్యవాదాలు తెలియజేశారు,ఆమోదముద్ర అసెంబ్లీలో తీర్మానం చేసిన విధంగా కేంద్రంలో కూడా మిత్రపక్షాల తోటి ప్రతిపక్షాలతోటి అందరిని ఏకతాటిపై తీసుకొచ్చి కేంద్రంలో కూడా బి సి రిజర్వేషన్ తీర్మానం చేయాలని కోరడం జరిగింది, ఈ కార్యక్రమంలో అధ్యక్షులుపున్న ,పవను,జిల్లా కార్యదర్శి మండల్ లింగయ్య యాదవ్,కార్యదర్శి దీకొండ నవీన్,జిల్లా ఉపాధ్యక్షులు గడగోజు విజయ చారి,టౌన్ ప్రెసిడెంట్ చెన్నోజు రాజు,బోగోజు వెంకటాచారి,ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్వర్ణసాగరం





## ‘శారీ’ చూశాక అమ్మాయిలు జాగ్రత్త పడతారు


ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ కొత్త సినిమా ’శారీ’. ఈ చిత్రంలో సత్య యాదు, ఆరాధ్య దేవి ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ చిత్రాన్ని సైకలాజికల్ థ్రిల్లర్ కథతో దర్శకుడు గిరి కృష్ణ కమల్ రూపొందించారు. ఆర్జీవీ, ఆర్వీ ప్రొడక్షన్స్ ఎల్ఎల్ పీ బ్యానర్‌పై ప్రముఖ వ్యాపారవేత్త రవిశంకర్ వర్మ నిర్మించారు. శారీ సినిమా ఏప్రిల్ 4న తెలుగు, హిందీ, తమిళం, మలయాళ భాషలలో పాన్-ఇండియా స్థాయిలో విడుదల కానుంది. హైదరాబాద్‌లో శారీ సినిమా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ “-మనం ఎవరితోనైనా డైరెక్ట్ గా మాట్లాడినప్పుడు పెద్దగా వారితో కనెక్ట్ కాము. కానీ వాట్సాప్ లాంటి సోషల్ మీడియా యాప్స్ ద్వారా మాట్లాడుకున్నప్పుడు మనం వారిని నేరుగా చూడటం లేదు గనుక త్వరగా వారితో కలిసిపోతాం. మన వ్యక్తిగతమైన విషయాలు కూడా చెప్పేస్తుంటాం. శారీ సినిమా నేపథ్యమిదే. ప్రాథమికంగా చూస్తే ఇది చాలా సీరియస్ సబ్జెక్ట్. నేను ఈ చిత్రానికి మూల కథ రాశాను. గిరి కృష్ణకమల్ దర్శకత్వం వహించాడు. ఆరాధ్య చీరకట్టులో చేసిన ఒక రీల్ చూసి ఆమెను కాస్ట్ చేశాం. ఆమె చేసిన పర్ ఫార్మెన్స్ సూపర్బ్ గా అనిపించింది. సత్య ట్రైన్డ్ యాక్టర్. తను బాగా నటించాడు. శారీ సినిమాలో మెసేజ్ ఉంటుందని చెప్పను గానీ ఈ సినిమా చూశాక అమ్మాయిలు జాగ్రత్తపడతారు”అని అన్నారు. డైరెక్టర్ గిరి కృష్ణకమల్ మాట్లాడుతూ “ఈ సినిమాకు నాకు ఇద్దరు గొప్ప యాక్టర్స్ సత్య యాదు, ఆరాధ్య రూపంలో దొరికారు. ఆరాధ్య దేవి ఎలా నటిస్తుందో నాకు తెలియదు. ఆమె రీల్స్ మాత్రమే చూశాను. కానీ అద్భుతంగా నటించింది. సత్య యాదు కొన్ని సీన్స్‌లో ఎదుట ఏ యాక్టర్ లేకుండా తనకు తాను పర్‌ఫార్మ్ చేయాల్సివచ్చేది.

## అందరు సెలబ్రిటీలు చేస్తున్నారు.. తప్పేంటనుకున్నా..! క్షమించండి..

బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసినవారిలో యూట్యూబర్ల నుంచి సినిమా స్టార్ల వరకు చాలామంది ఉన్నారు. అయితే వీరిలో కొంతమందికి ఈ యాప్స్ గురించి కనీస అవగాహన లేదు. నిమిషానికి లక్షలు ఇస్తున్నారనగానే ముందూవెనకా ఆలోచించకుండా ప్రమోషన్స్ చేశారు. ఇప్పుడేమో కేసు లో ఇరుక్కుని బాధపడుతున్నారు. ఆ జాబితాలో హీరోయిన్ అనన్య నాగళ్ల కూడా ఉంది. అవగాహన లేకపోవడం వల్లే సదరు యాప్స్‌ను ప్రమోట్ చేశామని అంగీకరించింది. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులకు క్షమాపణలు తెలియజేసింది. నేను తెలిసి ప్రమోషన్స్ చేయలేదు. అందరు సెలబ్రిటీలు చేస్తున్నారు.. కాబట్టి అందులో తప్పేం లేదనుకున్నాను. కానీ ఇకమీదట జాగ్రత్తగా ఉంటాను. బాధ్యతగా మసులుకుంటాను అని పోస్ట్ పెట్టింది.

అదే సమయంలో మెట్రో రైళ్లలో బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేయడాన్ని తప్పు పట్టింది. ప్రభుత్వ ఆస్తులపై బెట్టింగ్ యాప్స్‌ను ఇలా యథేచ్ఛగా ప్రమోట్ చేస్తున్నారు. అలాంటప్పుడు అది చట్టరీత్యా నేరమని మాకెలా తెలుస్తుంది? అని ప్రశ్నించింది. ఇది చూసిన కొందరు నెటిజన్లు.. ఆమె తెలియక చేశానని చెప్పాక నిందించడం సరి కాదని భావిస్తున్నారు. మరికొందరేమో.. లక్షల మంది అభిమానులున్నప్పుడు ఏ చిన్న పోస్ట్ పెట్టాలన్నా దాని దుష్ప్రభావాలను ముందుగానే బేరీజు వేసుకోవాలి అని సూచిస్తున్నారు. మల్లేశం సినిమాతో తెలుగు చలనచిత్ర పరిశ్రమకు కథానాయికగా పరిచయమైంది అనన్య నాగళ్ల. ప్లే బ్యాక్, వకీల్ సాబ్, మాస్ట్రో, మళ్లీ పెళ్లి వంటి పలు సినిమాలు చేసింది. గతేడాది.. తంత్ర, డార్లింగ్, పొట్టేల్, శ్రీకాకుళం షెర్లాక్ హెూమ్స్ సినిమాలతో మెప్పించింది.







## చిన్న సినిమాల హడావిడి

గత వారం కోర్ట్ రూపంలో ఒక చిన్న సినిమాకు పెద్ద విజయం దక్కడం చూసి బాక్సాఫీస్ హ్యాపీగా ఉంది. ఎంత నిర్మాత నాని అయినప్పటికీ కంటెంట్ లేకపోతే ప్రేక్షకులు నిర్మొహమాటంగా తిరస్కరించే ట్రెండ్‌లో ఎక్కువ శాతం కొత్తవాళ్లు నటించిన సీరియస్ డ్రామాకు వారం తిరక్కుండానే ముప్పై కోట్ల వసూళ్లు దాటడం చిన్న విషయం కాదు. ఈ నేపథ్యంలో రేపు మార్చి 21 ఏకంగా ఏడుకి పైగా చిన్న చిత్రాలు తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నాయి. కమెడియన్ సప్తగిరి ‘పెళ్లి కాని ప్రసాద్’కి ప్రమోషన్లు బాగానే జరిగాయి. కంటెంట్ మీద నమ్మకంతో ఇవాళ హైదరాబాద్ లో మూడు ప్రీమియర్లు వేస్తున్నారు. ఈ మధ్య కనిపించడం తగ్గించిన ఆది సాయికుమార్ ‘షణ్ముఖ’గా వస్తున్నాడు. ఫాంటసీ థ్రిల్లర్ గా రూపొందిన ఈ మూవీకి పెద్దగా పబ్లిసిటీ చేస్తున్న దాఖలాలు లేవు. దర్శక నిర్మాతలు మాత్రం హిట్టు పట్ల ధీమాగా ఉన్నారు. కోర్ట్ తో పేరు తెచ్చుకున్న హర్ష్ రోషన్ ఒక ప్రధాన పాత్ర పోషించిన ‘టుక్ టుక్’ ఏదో వెరైటీ కాన్సెప్ట్ తో రూపొందింది. టాక్ బాగుంటే జనాన్ని ఆశించవచ్చు. విదేశాల్లో షూటింగ్ జరుపుకున్న ‘అనగనగా ఆస్ట్రేలియా’ రేపే వస్తోంది. క్రైమ్ బ్యాక్ డ్రాప్ లో రూపొందిన మరో రెండు చిత్రాలు ఆర్టిస్ట్, ది సస్పెక్ట్ బరిలో ఉన్నాయి. వెరైటీ టైటిల్ పెట్టుకున్న బాలీవుడ్ డబ్బింగ్ ‘కిస్ కిస్ కిసిక్’కి హడావిడి చేస్తున్నారు. ఇవి కాకుండా రెండు రీ రిలీజులు వస్తున్నాయి. పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ‘ఎవడే సుబ్రమణ్యం’కు మరోసారి ఆదరణ దక్కుతుందనే నమ్మకం వైజయంతి మూవీస్ టీమ్ లో ఉంది. రెండేళ్లు తిరక్కుండానే తీసుకొస్తున్నా ‘సలార్ పార్ట్ 1 సీజ్ ఫైర్’ బుకింగ్స్ ఆశ్చర్యకరంగా ఉన్నాయి. అడ్వాన్స్‌లోనే కోటి రూపాయలు గ్రాస్ దాటడం రికార్డే. వీటితో పాటు కోర్ట్ రెండో వారంలోనూ స్ట్రాంగ్ గా కొనసాగనుంది. చాలా సెంటర్లలో సెకండ్ వీకెండ్ కి స్క్రీన్లు పెంచుతున్నారు. వచ్చే వారం పెద్ద సినిమాలు క్యూ కట్టిన నేపథ్యంలో ఇప్పుడొచ్చేవన్నీ ఎక్స్ ట్రాడినరి టాక్ తో మెప్పించగలిగితేనే నిలబడతాయి